సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 16-2-2024 15/-




# బడ్జెట్






సహజీవన భావనల సాధువాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 7 హైదరాబాద్
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 రూ.15-00
5 షాబాన్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

నిస్సందేహంగా ధర్మవేత్తలు ప్రవక్తలకు వారసులు. ప్రవక్తలు తమ వారసత్వంగా వదిలింది తమ జ్ఞానాన్నే. ఆ జ్ఞానాన్ని సంపాదించిన వారు చాలా పెద్ద సంపద పొందారు"

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...

| | | |
|---|---|---|
| ఉన్నత విద్య | ...... | 04 |
| బడ్జెట్ | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-17 | ...... | 08 |
| సరిహద్దు గాంధీ 'ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్' | ...... | 10 |
| చరితార్థులు-2 : రహ్మత్ అలీ వాజిద్ కే | ...... | 11 |
| హిజాబ్‌పై మళ్ళీ రభస | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| దివ్యఖుర్ఆన్ నేర్పిన 'దుఆ'లు | ...... | 20 |
| దక్షిణాదిన ఇస్లాం ప్రవేశం | ...... | 24 |
| ఇస్లాం : ఓ సంపూర్ణ జీవన సంవిధానం | ...... | 28 |
| మేరాజ్ సందేశం | ...... | 32 |

**ఆహా.! ఏమి భాష..**
**ఏమి సంస్కారం..!!**




మన రాజకీయ నేతల
భాష భలే బాగున్నది
అసభ్యం కుసంస్కారం
ఉట్టిపడుతు ఉన్నది!
విన్నకొద్దీ మళ్ళీమళ్ళీ
వినాలి అనిపిస్తున్నది
మున్సిపాల్టి మోరికన్న
మహా ఇంపుగ ఉన్నది!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# ఉన్నత విద్య

**ఆల్ ఇండియా** సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. ఉన్నత విద్యాభ్యాసానికి విద్యాసంస్థలు పెరగడం, విద్యా సంస్థల్లో ప్రవేశాలు పెరగడం ఎంతైనా సంతోషించదగిన విషయం. 2014 తర్వాత దేశంలో 7000 ఉన్నత విద్యా సంస్థలు కొత్తగా ఏర్పడ్డాయి. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు కూడా ఒక కోటి వరకు పెరిగాయి. 2014 తర్వాత ఉన్నత విద్యాసంస్థల్లో మహిళల ప్రవేశాలు కూడా 32 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. పిహెచ్డీ చేస్తున్న 2.12 లక్షల మందిలో 98వేల మంది మహిళలున్నారు. ఈ వివరాలన్నీ చాలా సంతోషం కలిగించేవి.


ఏడేళ్ళ క్రితం ఉన్నత విద్యారంగంలో ప్రభుత్వ విద్యాసంస్థల సంఖ్య ఎక్కువగా ఉండేది. ప్రయివేటు విద్యాసంస్థల సంఖ్య తక్కువగా ఉండేది. కేంద్రప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని యూనివర్శిటీలు కాలేజీల సంఖ్య 53 శాతం పెరిగింది, కాగా ప్రయివేటు విద్యా సంస్థల సంఖ్య 81 శాతం పెరిగింది. అంటే విద్య ప్రయివేటీకరించబడుతోంది. కేవలం లాభాపేక్షతో విద్యారంగంలో ప్రవేశిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ ప్రయివేటు విద్యా సంస్థల ఫీజులు ఎక్కువ. ఈ విద్యాసంస్థల్లో విద్యాసంబంధిత సదుపాయాలు, బోధకులకు సంబంధించిన వివరాలు పారదర్శకంగా లేవు. దీన్ని బట్టి ప్రభుత్వం ఉన్నత విద్యా రంగాన్ని ప్రయివేటీకరించడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తుందన్న విషయం బోధపడుతుంది. ప్రభుత్వ విద్యా సంస్థల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల అక్కడ పోటీ ఎక్కువగా ఉంటుంది. ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజులు భరించలేని బలహీన వర్గాల పిల్లలకు ఇవి అందుబాటులో లేవు. అంటే బలహీన వర్గాలకు అందుబాటులో లేని ఉన్నత విద్య డబ్బులు వెచ్చించగలిగిన వర్గాలకు సునాయాసంగా అందుతోంది.

ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. కాని అదే నిష్పత్తిలో టీచర్ల సంఖ్య పెరగడం లేదు. కేవలం 8.4 శాతం మాత్రమే టీచర్ల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. అంటే విద్యాప్రమాణాలు పడిపోయాయి. టీచర్ల సంఖ్య తక్కువగా ఉండడమంటే ప్రభుత్వం తక్కువ ఖర్చు చేస్తున్నట్లు అర్థం చేసుకోవాలి. జాతీయ విద్యా విధానంలో చాలా గొప్ప ఆదర్శాలు చెప్పుకున్నప్పటికీ విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కలిగి ఉందన్నది అర్థమవుతోంది.

యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎక్కువగా హ్యుమానిటీస్ చదువుతున్నారు. సైన్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీల్లో తక్కువగా ఉన్నారు. దీనికి కారణమేమిటి? వారికి ఇంజనీరింగ్, టెక్నాలజీ, ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులో లేకపోవడమే కారణమా? ఈ వివరాలు కూడా తెలియవలసి ఉంది.

ఏది ఏమైనా దేశంలో ఉన్నత విద్యారంగం స్థితిగతులను తెలియజేసే ఇలాంటి నివేదికలతో పాటు వివిధ సముదాయాల్లో విద్యాభ్యాసం, ముఖ్యంగా ఉన్నత విద్యాభ్యాసం ఎలా ఉంది? ఏ సముదాయాలకు చెందిన వారు తక్కువ సంఖ్యలో ఉన్నత విద్యాభ్యాసానికి వస్తున్నారు? కారణాలేమిటి? వంటి సర్వేలు కూడా జరగవలసిన అవసరం ఉంది. ఈ వివరాల ద్వారా అన్ని సముదాయాల సమగ్ర విద్యాభివృద్ధికి ప్రయత్నాలు చేయవచ్చును.

అబ్దుల్ వాహెద్




# బడ్జెట్

**ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది.** ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రసంగం చేశారు.

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మొదటి తేదీ బడ్జెట్ ప్రవేశపెట్టిన మాదిరిగానే ఈసారి కూడా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రభుత్వానికి ఎంత ఆదాయం ఎక్కడి నుంచి ఎలా వస్తుంది? ఎక్కడ ఎలా ఖర్చు పెడతారన్న వివరాలు చెప్పారు. ఈ సారి బడ్జెటు ఇంటెరిమ్ బడ్జెట్? అంటే ఇది తాత్కాలిక బడ్జెటు.. మొత్తం సంవత్సరానికి సంబంధించి అంచనాలుగా భావించాలి. ఎందుకంటే ఈ సంవత్సరం లోక్ సభ ఎన్నికలు కూడా ఉన్నాయి. అంటే ఎన్నికల తర్వాత కొత్త సర్కారు ఏర్పడిన తర్వాత జులై నెలలో పూర్తి బడ్జెటు ప్రవేశ పెట్టడం జరుగుతుంది. అయితే రానున్న కొన్ని నెలల కాలంలో ప్రభుత్వానికి ఆదాయం, ఖర్చులు ఎలా ఉంటాయన్నది మనకు ఈ ఇంటెరిమ్ బడ్జెట్ వల్ల తెలుస్తాయి.

కాబట్టి ఈ బడ్జెటు గురించి తెలుసుకోవడం అవసరం. ప్రజలకు ఈ బడ్జెట్ ఏమిస్తోంది? గత బడ్జెటులో చెప్పిన మాటలు ఎంత వరకు నిలబెట్టుకున్నారన్నది ఒకసారి మదింపు చేయడం అవసరం. గత సంవత్సరం కేపెక్స్ అంటే కేపిటల్ ఎక్స్‌పెండిచర్ అంటే భారీస్థాయిలో ఇన్‌ఫ్రాస్టక్చర్ వగైరాలకు పెట్టే ఖర్చు 33 శాతం నుంచి 35 శాతానికి పెంచారు. పది లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. కాని ఈ కేటాయింపు మొత్తం ఖర్చు చేయడం జరగలేదు. తొమ్మిదిన్నర లక్షల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం 11 లక్షల 11 వేల కోట్ల రూపాయల వరకు ఈ ఖర్చు పెంచే శారు. ఈ ఖర్చు పెట్టడం వల్ల ఆర్థికాభివృద్ధి వేగం పుంజు కుంటుందని ప్రభుత్వం చెబుతుంది. ఉద్యోగాలు వస్తాయని అంటుంది. సహజంగానే పెద్ద పెద్ద బ్రిడ్జిలు, రోడ్లు, పోర్టులు వగైరా నిర్మిస్తున్నప్పుడు చాలా మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నది నిజమే. ముఖ్యంగా రైల్వేలకు 2.55 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. మూడు కొత్త కేరిడార్లు కూడా ప్రకటించారు. చాలా మంచి ప్రకటనలు. దాంతో పాటు రైలు ప్రయాణాన్ని సురక్షితంగా మార్చడానికి కూడా తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ఎందుకంటే గత సంవత్సరం అనేక

రైలు ప్రమాదాలు జరిగాయి. అక్టోబర్ 29న ఆంధ్రప్రదేశ్ లో, అక్టోబర్ 11న బీహారులో, సెప్టెంబరు 26న మధుర జంక్షన్ వద్ద, జూన్లో ఒడిశాలో రైలు ప్రమాదం వంటివి చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి కూడా తగిన ప్రయత్నాలు చేస్తారని ఆశిద్దాం. వ్యవసాయరంగంలో ఆత్మనిర్భరత గురించి ఈ సారి ప్రభుత్వం గట్టిగా చెప్పింది. పర్యావరణానుకూల ఎరువుల వాడకం గురించి పేర్కొనడం జరిగింది. వంటనూనెల దిగుమతులను తగ్గిస్తామని కూడా చెప్పారు. కాని ఎరువులకు ఇచ్చే సబ్సిడీల బడ్జెటును తగ్గించారు. ఆహారంపై ఇచ్చే సబ్సిడీలకు కూడా కోత పెట్టారు. విద్యకు ఇచ్చిన కేటాయింపులు స్వల్పంగా పెంచినప్పటికీ యుజీసీకి ఇచ్చే కేటాయింపుల్లో భారీ కోత పెట్టారు. ఐఐటీ, ఐఐఎంలకు కేటాయింపుల్లో కూడా కోతలు పెట్టారు. విద్యారంగంలో మరి కొద్దిగా పెంచిన బడ్జెటును ఎక్కడ కేటాయించారంటే, కేంద్ర విశ్వవిద్యాలయాలకు ఇచ్చారు. రిసెర్చ్ కోసం కేటాయింపులు పెంచారు. ఆరోగ్యరంగంలో గత సంవత్సరం కేటాయింపులను పూర్తిగా ఖర్చు పెట్టలేదు. ఈసారి కొంత కేటాయింపు పెంచారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు కేటాయింపులు పెంచారు.

రియల్ జీడీపీ రేటు అంటే వాస్తవ స్థూల జాతీయ ఉత్పత్తి ఈ ఆర్థిక సంవత్సరం 7.3 శాతం ఉంటుందన్నారు. జీడీపీ రెండు విధాలు. ఒకటి నామినల్ జీడీపీ. ఇందులో నేటి ధరల ప్రకారం ఆర్థికవ్యవస్థ పరిమాణం తెలుస్తుంది. రియల్ జిడీపీలో ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు దేశంలో 15 శాతం నామినల్ జిడీపీ పెరుగుదల ఉంటే, ద్రవ్యోల్బణం 10 శాతం ఉంటే, రియల్ జిడిపీ రేటు 5 శాతం అయిపోతుంది. 2022-23లో నామినల్ జీడీపీ రేటు 10.5 శాతం. ద్రవ్యోల్బణం దాదాపు 4 శాతం ఉంది. అంటే రియల్ జీడిపి 6.5శాతం. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇంతకు ముందు ఇచ్చిన గణాంకాల్లో కూడా 6.3 శాతం చూపించింది. 2027 నాటికి భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని కూడా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తెలియజేసింది.

కాని ఈ సారి బడ్జెటును చూస్తే 28 శాతం ఆదాయం రుణాల నుంచి పొందుతామంటున్నారు. ఇది కాకుండా 19 శాతం ఆదాయం ఆదాయపు పన్ను ద్వారా లభిస్తుంది. 18 శాతం జియస్టీ తదితర టాక్సుల నుంచి లభిస్తుంది. 17 శాతం కార్పోరేట్ టాక్సుల నుంచి లభిస్తుంది. దేశంలో అత్యధిక ఆదాయం కార్పోరేట్లు సంపాదిస్తారు. కాని వారి వల్ల ప్రభుత్వానికి లభిస్తున్న ఆదాయం కేవలం 17 శాతం మాత్రమే. కాని మధ్యతరగతి నుంచి 18 శాతం ఆదాయపు పన్ను రూపంలో లభిస్తుంది. నాన్ టాక్స్ రెవిన్యూ 7 శాతం, ఎక్సయిజ్ డ్యూటీ కేవలం 5 శాతం మాత్రమే ఉంది. కస్టమ్స్ నుంచి 4 శాతంగా కనిపిస్తుంది. దీన్ని బట్టి అర్థమయ్యేదేమంటే 28 శాతం రుణాల ద్వారా ఆదాయం పొంది దేశాన్ని నడుపుతున్నారా? ఇంత భారీగా రుణాలు ఎందుకు తీసుకుంటున్నాం? అనే ప్రశ్నలు ఆలోచించవలసినవి.

ఇక ఖర్చుల విషయానికి వస్తే, తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించాలి కాబట్టి వచ్చిన ఆదాయంలో 20 శాతం వడ్డీల చెల్లింపులకే పోతుంది. మరో 20 శాతం రాష్ట్రాల వాటాగా వెళ్ళిపోతుంది. 16 శాతం కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఖర్చు పెడుతున్నారు.

సంక్షేమ పథకాలకు సంబంధించి రేవడీ కల్చర్ అని తాయిలాలని వ్యంగ్యంగా, వెటకారంగా మాట్లాడే నేతల మాటలు చాలా విన్నాం. కాని వాస్తవానికి 16 శాతం మాత్రమే ఈ సంక్షేమ పథకాలకు ఖర్చవుతున్నాయని తెలుస్తోంది. అలాగే సబ్సిడీలకు చేస్తున్న ఖర్చు కూడా కేవలం 6 శాతం మాత్రమే. పెన్షన్లకు చేస్తున్న ఖర్చు కేవలం 4 శాతం. ఈ బడ్జెటును గమనిస్తే స్పష్టంగా అర్థమవుతున్న విషయం, అభివృద్ధి గురించి ఎన్ని కబుర్లు చెప్పినా, టాక్సు వసూళ్ళ గురించి ఎన్ని మాటలు చెప్పినా చివరకు ప్రభుత్వం నడపడానికి రుణాలు తీసుకోవడం తప్పడం లేదు. అది కూడా భారీ రుణాలు. ఈ రుణాలు తీసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? వచ్చిన ఆదాయంతోనే సరిపెట్టుకోలేమా? ఈ దుబారా ఖర్చులు ఎక్కడ అవుతున్నాయో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను నిశితంగా పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుంది.

ఈ రుణాల వల్ల పెద్ద నష్టమేమిటంటే, ఆదాయంలో 20 శాతం వరకు వడ్డీలపై రుణాలకే సరిపోతోంది. ఇది కేంద్రప్రభుత్వ స్థాయిలో తీసుకుంటున్న రుణాల లెక్క. రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే రుణాలు వేరుగా ఉంటాయి. ఇవి కాకుండా క్రింది స్థాయిలో తీసుకునే రుణాలు కూడా ఉంటాయి. మరో విషయమేమిటంటే ప్రపంచంలో అత్యధికంగా రక్షణపరికరాలు, ఆయుధాలు దిగుమతి చేసుకునేది మనమే. ఆయుధాలు అమ్మేది అమెరికా తదితర అగ్రరాజ్యాలు. బడ్జెట్ కేటాయింపులను చూస్తే 6లక్షల కోట్లకు పైగా రక్షణరంగానికి కేటాయిస్తే, విద్యారంగానికి ఒక

లక్షా ఇరవై వేల కోట్ల పైచిలుకు, వ్యవసాయానికి రైతు సంక్షేమానికి ఒక లక్షా 27 వేల కోట్ల పైచిలుకు ఖర్చు పెడుతున్నాం. వైద్యరంగంలో ఆసుపత్రుల ఖర్చులు పెరుగుతున్నాయి. ఆరోగ్యంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు తగ్గుతూ వస్తోంది. పాశ్చాత్య దేశాల్లో ఉన్న ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి వగైరాల నుంచి రుణాలు తీసుకుంటున్నాం, ఆ దేశాల్లోనే ఉన్న ఆయుధ వ్యాపారుల నుంచి ఆయుధాలు కొంటున్నాం, ఆ దేశాలకే వడ్డీలు చెల్లిస్తున్నాం. రక్షణ రంగంలో చేస్తున్న అధిక ఖర్చు సైనికుల జీతభత్యాల ఖర్చు కాదు, పెన్షన్ల ఖర్చు కాదు, పైగా నాలుగేళ్ళ అగ్నివీర్‌లను తీసుకొచ్చి ఖర్చు తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ఖర్చు ఆయుధాల కొనుగోలు ఖర్చు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే విద్యపై చేస్తున్నఖర్చును ఇతర ఖర్చులతో పోల్చి చూసుకుంటే మన ప్రాధాన్యతలు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. ఆయుధాల కొనుగోలు, రక్షణ పరికరాల కొనుగోళ్ళకే ఈ ఖర్చు ఎక్కువ అవుతుంది. మన దగ్గర డబ్బులు లేకపోతే వాళ్ళు అప్పు ఇచ్చి మరీ కొనేలా చేస్తున్న పాశ్చాత్య దేశాల కుట్రలివి.

అలాగే రైల్వేల విషయానికి వస్తే, రైలు టిక్కెట్లు పెరుగుతున్నాయి. రైల్వేల్లో ఇస్తున్న సదుపాయాల ఖర్చులు ప్రయాణీకుల నెత్తినే పడుతున్నాయి. చివరకు టీ ధర కూడా పెరిగిపోయింది. అయినా రైల్వేకు వస్తున్న ఆదాయం ఆ సంస్థను నడపడానికి చాలడం లేదు. భారీగా కేటాయింపులు ఇవ్వవలసి వస్తోంది. రైల్వేల బడ్జెట్ పెంచడం వెనుక రైల్వేలను మరింత ఆధునీకరించడం ద్వారా రైల్వేలను ప్రయివేటుకు అమ్మడానికి సిద్ధం చేయాలన్న ఎత్తుగడ ఉందన్న విశ్లేషణలు కూడా వస్తున్నాయి. అందుకే సబ్సిడీలు తగ్గించడం, కిరాయి పెంచడం, ఆధునిక సౌలభ్యాలపై దృష్టిపెట్టడం, పేదలకు ఉపయోగపడుతున్న జనరల్ బోగీ పాసింజర్ రైళ్ళను పక్కన పెట్టి విపరీతమైన వేగంతో నడిచే రైళ్ళపై దృష్టిపెట్టడం వగైరా చేపడుతున్నారన్న విశ్లేషణలు వస్తున్నాయి. 2014 తర్వాతి నుంచి రైల్వేల ఖర్చు భారీగా పెరిగిపోయింది. క్లుప్తంగా చెప్పాలంటే ప్రభుత్వం రెవిన్యూతో పాటు రుణాలు తీసుకోవడం ద్వారా, ప్రయివేటైజేషన్ పేరుతో ప్రభుత్వ సంస్థలను అమ్మడం ద్వారా డబ్బులు సంపాదించి ఖర్చు పెట్టాలని చూస్తోంది.

కేంద్ర సంక్షేమ పథకాల్లోను చాలా కోతలు పెట్టారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలు కూడా తగ్గించారు. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఒత్తిడితోనే ఈ చర్యలు తీసుకుంటున్నారని చాలా మంది విశ్లేషిస్తున్నారు.

మరోవైపు దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. ఐఐఎం లక్నో లో చదువుకున్న విద్యార్థులు కూడా ఉద్యోగాల కోసం వేచి చూసే పరిస్థితి ఉందని వార్తలు వచ్చాయి. ఐఐటిల్లో చదువుకున్న విద్యార్థులు కూడా నిరుద్యోగులుగా ఉండే పరిస్థితి ఉందంటే సాధారణ ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుకుంటున్న వారి పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇంకో వైపు ఐటి పరిశ్రమలో కూడా నెగిటివ్ గ్రోత్ ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ కూడా ఉద్యోగాలు కరువవుతున్నాయి. చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. నిరుద్యోగ సమస్యతో పాటు ప్రజల్లో క్రయశక్తి తగ్గిపోయింది. ఉత్పాదక రంగం కుదేలవుతోంది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. దేశంలోకి వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కేవలం నాలుగైదు రాష్ట్రాలకే వెళుతున్నాయి. బీహార్, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చేరడం లేదు. దీనివల్ల ఆర్థిక అసమానతలు విభిన్న రాష్ట్రాల మధ్య పెరుగుతున్నాయి. ఈ అసమానతలు ఉన్నప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందడం అన్నది సాధ్యమా?

ప్రజల్లో క్రయశక్తి తగ్గిపోయింది. వినిమయ వస్తువులు తయారు చేసే కంపెనీల ప్రగతి స్తంభించిపోయింది. మన్రేగా కోసం ప్రభుత్వం గత బడ్జెటులో 60 వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు 86 వేల కోట్ల రూపాయలు. మన్రేగాకు బడ్జెట్ కేటాయింపు పెంచే పరిస్థితి ఎప్పుడు వస్తుందంటే దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి దొరకనప్పుడు మాత్రమే. క్రెడిట్ కార్డు లోన్లు పెరిగిపోయాయని, పర్సనల్ లోన్లు పెరిగిపోయాయని డాటా చెబుతోంది. దీన్ని బట్టి దేశంలో మధ్యతరగతి తీవ్రమైన ఇబ్బందుల్లో ఉందన్నది స్పష్టమవుతున్న వాస్తవం.

ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కించేలా ఉందా ఈ బడ్జెట్ అన్నది అందరూ ఆలోచించవలసిన విషయం. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com

అధ్యాయం -6

17

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

## మదీనాలో

ఈ మహనీయుల కృషి ఫలితంగా మదీనాలో ఇస్లామ్ వ్యాపించసాగింది. కొంత కాలానికే అక్కడ చాలా మంది సత్య ధర్మాన్ని ఆశ్రయించారు, క్రమేణ ఇంకా కొందరిని మక్కా నుండి మదీనాకు పంపడం జరిగింది. కొందరు వెళ్ళిన తరువాత మహనీయ ఉమర్ (ర) కూడా ప్రయాణానికి సన్నద్ధులయ్యారు. తొలుత ఆయన కాబా ప్రదక్షిణ చేసుకుని నమాజ్ చేశారు. ఆ పైన ప్రకటించారు, "ఇదో, నేను మదీనా వెడుతున్నాను, మీలో ఎవరయినా నన్ను ఆపదలచుకుంటే, హరమ్ (కాబా) బయటికి వచ్చి నన్ను కలసుకోగలడు" అంటూ బయటికి వచ్చేశారు. అంతటా మౌనం తాండవించింది!

ఆయనకు తోడుగా ఇంకా కొందరు ముస్లిములు బయలు దేరారు. వారిలో, స్వంత సోదరుడు జైద్, సోదర సుతుడు సయీద్, అల్లుడు ఖునయిస్, ఇంకా ఇతర మిత్రులు సన్నిహితులు అంతా కలిసి ఇరవై మంది మదీనాకు వెళ్ళారు. మక్కా నుండి మదీనాకు వచ్చిన కొంతమంది మదీనాలోనూ చాలా మంది పొలిమేరలోని గ్రామం కుబాలో నివాసం ఏర్పరచుకో వలసి వచ్చింది. ఆ తరువాత కూడా మక్కా నుండి వచ్చేవారి పరంపర కొనసాగింది. కడకు నబవీ 13వ సంవత్సరం, రబీఉల్ అవ్వల్ నెలలో (క్రీ. శ. 622, డిసెంబర్ నెలలో) ప్రవక్త మహనీయులు (స) మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసి వచ్చేశారు.

## సలహా మండలిలో పీఠం

మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన ఇల్లూవాకిలి లేని ఓ ముహాజిర్ మరి మదీనాలో వారిని ఆహ్వానించిన సహాయకుల (అన్సారుల)లోని ఓ వ్యక్తి మధ్య ప్రవక్తశ్రీ(స), హిజ్రత్ చేసి వచ్చిన తరువాతనే, సోదరత్వం స్థాపించారు. ఈ ఏర్పాటులో మహనీయ ఉమర్(ర)కు ఉత్బాన్ బిన్ మాలిక్‌తో సోదరత్వం నెలకొల్పడం జరిగింది. ఉత్బాన్ కుబాలో నివసించేవారు కావటాన ఇస్లామీయ కేంద్రం, ప్రవక్త సన్నిధిలోకి, మదీనాకు మహనీయ ఉమర్ ఆయన సోదరులు ఉత్బాన్ ఇద్దరూ రావటం కుదిరేది కాదు. ఒక రోజు ఉత్బాన్ వస్తే మరో రోజు ఉమర్ వచ్చేవారు.

ప్రవక్త మహనీయులు(స) తన కొరకు స్థాపించుకున్న సలహా మండలిలో ఉమర్ ఫారూక్ కూడా ఒక సభ్యులు. మక్కాలో నయితే ఒక్కొక్కరు కూడా నమాజ్ చేసుకోవడం దుర్లభమయిన విషయం, సామూహికంగా చేసుకోవడం ఊహాతీతం! అయితే ప్రవక్త శ్రీ మదీనా వచ్చిన తరువాత మస్జిద్ నిర్మించబడింది, స్వేచ్ఛ లభించింది, నమాజ్ కొరకు(అజాన్)

పిలుపు నిచ్చే ఆదేశమయింది, దైవం తరఫున. ప్రవక్త శ్రీ ఈ విషయాన్ని సూచన కొరకు సలహా మండలిలో పెట్టారు. యూదులూ క్రైస్తవులూ ఆరాధన కొరకు అనుసరించే పద్ధతులు అనుసరించాలని, కూడదని, వాటికి మారుగా ఆరాధనకు సూచనగా దీవిటీలు వెలిగించాలని సూచనలు వచ్చాయి.

అప్పుడు మహనీయ ఉమర్ నిలబడి, "వీటన్నింటి కన్నా దైవ నామ సమున్నతిని ఎందుకు ప్రకటించకూడదూ?" అని ప్రతిపాదించారు. అది దైవ సందేశహరులకు ఎంతో నచ్చింది. అదే అజాన్ పిలుపుకు ఆధారం.

## దైవనామ సమున్నతి కొరకు

ముస్లిములు మక్కా వదిలి పోవడంవల్ల కురైషీలు వారి పట్ల వైరంలో మరింతగా పెచ్చరిల్లారు. మక్కాలోని ముస్లిముల ఇళ్ళు, వారికి చెందిన వాటినన్నింటినీ వశపరచుకున్నారు. అంతటితో ఆగక మదీనాకు వెళ్ళి వారిని సర్వనాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. దానికి గాను వారు మదీనాలోని యూదులతోనూ కొత్తగా ఉనికిలోకి వచ్చిన కపట ముస్లిములతోనూ రహస్య సమాలోచనలు జరిపి ముస్లిముల మీదికి దండెత్తాలని యోచించారు. అయితే ముస్లిములకు వారి ఇటువంటి ఎత్తుగడలను త్రిప్పికొడుతూ తాము సంఘటితమయ్యేవరకు ఒకటిన్నర సంవత్సరం పట్టింది.

మక్కా బహుదైవారాధకులు తమవంటి వారిని తోడుగా తీసుకుని మదీనా పైకి దాడి జరిపే ఉద్దేశంతో బయలుదేరిన సమాచారం ప్రవక్తశ్రీకి ముందుగానే అంది, ఆయన కూడా వారిని ఎదుర్కొనేందుకు సమాయత్తమయి బయలుదేరారు. బద్ర్ అనే చోట ఈ మార్కోలు సంభవించింది. ఇందులో దైవ దాసులయిన ముస్లిముల సంఖ్య 313. వీరిలో ముసలి వారు, యువకులు, యవ్వనానికి చేరని వారు కూడా ఉన్నారు. అయితే దైవ తిరస్కారులు, బహుదైవారాధకులు కలసి ఒక వెయ్యిమంది!


ప్రవక్త శ్రీ ప్రారంభానికి ముందు దైవ సన్నిధిలో నేలకు తల ఆనించి రోదిస్తూ దైవాన్ని వేడుకున్నారు. తల లేపక ముందే దేవుని సహాయం అందే శుభవార్త తెలియజేయడం జరిగింది. అలాగే మక్కా నాయకులు అనేక మంది బద్ర్ మైదానంలో ముస్లిముల కరవాలాలకు బలి అయి పడి ఉన్నారు. 90 మంది పట్టుబడ్డారు. ఇదంతా కొంత సమయంలోనే సంభవించిన ఉదంతం! ఈ మరువలేని ఉదంతంలో మహనీయ ఉమర్ పాత్రకు కొన్ని సాక్ష్యాధారాలు:

1. ఈ పోరులో మొదటి షహీద్ (అమరగతి పొందిన) వ్యక్తి మహనీయ ఉమర్ నౌకరు మహజ్.
2. ఆయన మామ ఆసీ బిన్ హిషామ్ కురైష్ నాయకులకు చెందిన వ్యక్తి. అతన్ని తిరిగి మక్కాకు వెళ్ళే అవకాశం ఇవ్వలేదు ఆయన, స్వయంగా ముందుకు వెళ్ళి హత మార్చారు.
3. ఆయనకు తోడుగా ఆయన సన్నిహితులు, తెగ వారు 11 మంది ఈ పోరులో ఇస్లామ్ కొరకు పోరాడారు.
4. కురైష్‌కు చెందిన తెగలన్నీ ఒక్కటయి బద్ర్ మైదానంలో ముస్లిములతో పోరాడటానికి వచ్చారు, కాని మహనీయ ఉమర్ తెగకు చెందిన వారు ఎవ్వరూ ఆయన ప్రభావానికి జడిసి ఆ పోరులో పాల్గొన లేదు.
5. యుద్ధ ఖైదీలను గురించి మహనీయ అబూ బక్ర్‌తోపాటు అనేక మంది సహచరులు వారిని ఏదయినా పరిహారం తీసుకుని వదలి వేయాలని సలహానిచ్చారు. కాని మహనీయ ఉమర్ వారినందరినీ చంపివేయాలని, ఇంకా ఏ ఖైదీ ఎవరి బంధువో అతనే ఆ ఖైదీని చంపాలని సలహా ఇచ్చారు. విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త శ్రీ అధికుల మాట ప్రకారం ఖైదీలను వదిలి వేశారు. తరువాత వహీ అవతరణ జరిగి మహనీయ ఉమర్ అభిప్రాయాన్ని ధ్రువపరిచింది.
6. ఓడిపోయిన యుద్ధం వల్ల మక్కా బహు దైవారాధకులు చితికిపోయిన మనోబలంతో ఏమీ తోచక ప్రవక్త శ్రీ ని చంపివేయాలని అనుకున్నా వీల్లేదని భావించి తికమక పడుతున్నారు. అటువంటి సందర్భంలో ఇబ్ను ఉమయ్య అనే ఓ పెద్దమనిషి ఉమైర్ బిన్ వహబ్‌ని విషం పూసిన కరవాలంతో మదీనాకు పంపించాడు. అయితే మహనీయ ఉమర్ అతన్ని చూశారు, వెంటనే ఓ చేత్తో మెడ పట్టి అతన్ని ప్రవక్త శ్రీ వద్దకు తీసుకు వచ్చారు. ప్రవక్త శ్రీ ప్రశ్నకు అతను, నా కొడుకు యుద్ధ ఖైదీల్లో ఉన్నాడు అతన్ని విడిపించు కునేందుకు వచ్చానని చెప్పాడు. దానికి ప్రవక్త శ్రీ, "నన్ను మోసపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నావు. అసలు విషయం ఎందుకు చెప్పవు? నిన్ను సఫ్వాన్ బిన్ ఉమయ్యా నన్ను చంపడానికి పంపాడు కదూ!" అని గద్దించారు. అంతే అతను విని ముస్లిమ్ అవడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఎందుకంటే ఈ విషయం అతనికీ సఫ్వాన్‌కీ తప్ప మరెవరికీ తెలియదు.

★★★

డా. మహమ్మద్ హసన్, సహాయ ఆచార్యులు

ఫిబ్రవరి 6
ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ గారి
జయంతి
సందర్భంగా



# సరిహద్దు గాంధీ 'ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్'

**"ఆయుధం** పట్టుకొని యుద్ధం చేసే వ్యక్తి కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన వ్యక్తే ప్రమాదకరమైన వ్యక్తి" అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. 'నేను ఎట్టి పరిస్థితుల్లోనూ అహింసామార్గాన్ని వీడను. పగ, ప్రతీకారాల జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను' అన్న ప్రతిజ్ఞతో 'ఖుదాయే కిద్మత్ గార్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి సరిహద్దు గాంధీగా ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పేరు పొందారు. బాద్షా ఖాన్‌గా కూడా ఆయన ప్రసిద్ధి చెందారు. స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయ వాది, భారతరత్న పురస్కారమును పొందిన తొలి భారతీయేతరుడు. 'ఎర్రచొక్కాల ఉద్యమం' (Red shirt movement) ప్రారంభించిన ప్రముఖుడు. ఇతని అనుచరులను 'ఖుదాయీ ఖిద్మత్‌గార్' (భగవత్సేవకులు) అని పిలిచేవారు. ఇతను పష్తో లేదా పక్తూనిస్తాన్‌కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫార్ ఖాన్ భారతదేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన ఫక్తూన్ స్వాతంత్ర్య కార్య కర్త. 'బచా ఖాన్'గా ప్రసిద్ధి చెందిన అతను మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు, మిత్రుడు, ఆయన భారత దేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్‌లో బచా ఖాన్‌గా సుపరిచితులు.

భారతదేశం విభజన(1947లో) అనంతరం పాకిస్తాన్‌లో స్థిరపడిన గఫార్ ఖాన్... తన జీవితంలో దాదాపు 42 ఏండ్లు జైలులోని గడిపాడు. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న జన్మించారు. తండ్రి వ్యతిరేకించినప్పటికీ మిషనరీ పాఠశాలలో చదువుకున్నారు. తదుపరి ఉన్నత చదువులను అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ నుంచి పూర్తిచేశారు.

ఇరవై ఏండ్ల వయస్సులో తన స్వస్థలమైన ఉత్మాన్ జైలో గఫార్ ఖాన్ ఒక పాఠశాలను ప్రారంభించగా.. 1915లో బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. తర్వాత మూడేండ్ల పాటు అతను ఫక్తూన్‌లో అవగాహన కల్పించడానికి వందలాది గ్రామాల్లో పర్యటించారు.

బ్రిటిష్ వారి నుండి ఇండియా, పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా ఆయన చాలా కాలం పాటు గృహ నిర్బంధంలో వున్నారు. ఆ సమయంలో గఫార్ ఖాన్ తీవ్రమైన పక్షవాతంతో బాధపడ్డారు. అతన్ని చికిత్స కోసం భారతదేశానికి తరలించారు, భారతదేశంలోని వైద్య సిబ్బంది అతనికి చికిత్స చేయలేమని ప్రకటించారు. తర్వాత ఆయనను పెషావర్‌లోని లేడీ రీడింగ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు, అక్కడ జనవరి 20, 1988న మరణించారు.

ది ఫ్రాంటియర్ గాంధీ: ది బాద్షా ఖాన్, ది టార్చ్ ఫర్ పీస్' అనే పేరుతో రచయిత, చిత్ర నిర్మాత టి.సి. మెక్లూహాన్ ఆయన జీవితంపై సినిమా తీశారు. ఆ సినిమా 2008లో విడుదలైంది అదే విధంగా 2009 మిడిల్ ఈస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా బహుమతిని గెలుచుకుంది. "ది మెజెస్టిక్ మ్యాన్," ఆంగ్లంలో ఒక చిన్న జీవిత చరిత్ర డాక్యుమెంటరీని 1989 సంవత్సరంలో అబ్దుల్ కబీర్ సిద్దిఖీ రూపొందించారు. నటుడు దిల్షేర్ సింగ్ రిచర్డ్ అటెన్‌బరో యొక్క చిత్రం "గాంధీ"లో నటించారు. అతని గౌరవార్థం న్యూఢిల్లీలోని కరోల్ బాగ్‌లోని గఫార్ మార్కెట్ అని పేరు పెట్టారు. ■

## 'చరితార్థులు'-2



# రహ్మాత్ అలీ వాజిద్ కే

# (1885-1915) 34






**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

**భారత** స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో భాగంగా ఆంగ్ల అధికారుల్లో కంగారు పుట్టించిన గదర్ ఉద్యమ యోధులలో రహ్మాత్ అలీ వాజిద్ కే ఒకరు. 1885లో పంజాబ్ రాష్ట్రం వాజిద్ కే గ్రామంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి ముల్లా బక్ష్ ఖురేషి. చేనేత ప్రధాన వృత్తిగా గల కుటుంబానికి చెందిన రహ్మాత్ అలీ ఉద్యోగం నిమిత్తం తొలుత మలయా వెళ్ళి అటు నుండి మనీలాకు వెళ్ళారు. అక్కడ ఆయనకు మనీలా గదర్ ఉద్యమంతో మంచి పరిచయం ఏర్పడింది. మాతృభూమిని ఆంగ్ల వలసపాలకుల నుండి విముక్తం చేయడానికి సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న ప్రవాస భారతీయులతో అమెరికాలో 1913లో ఏర్పడిన 'గదర్ పార్టీ' పట్ల రహ్మాత్ అలీ ఆకర్షితులయ్యారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభం కాగానే అంతర్జాతీయంగా బ్రిటన్‌కు ఏర్పడిన ప్రతికూల వాతావరణాన్ని ఉపయోగించుకుని, ప్రజలను, భారతీయ సైనికులను ఏకం చేసి ఇంటా బయటా ఆంగ్ల పాలకుల మీద తిరుగుబాటు సాగించాలని గదర్ పార్టీ నిర్ణయించింది. మాతృభూమి వదలి వలస పాలకులు పారిపోయేలా చేయాలన్న సంకల్పంతో 'గదర్ వీరులు' సాయుధులై ముందుకు సాగారు. ఆ నిర్ణయం మేరకు పలు దేశాలలోని గదర్ వీరులందర్ని స్వదేశం చేరుకోవాల్సిందిగా గదర్ పార్టీ పిలుపు ఇచ్చింది. ఆ పిలుపు మేరకు రహ్మాత్ అలీ కూడా మనీలా నుండి ఇండియా తిరిగి వచ్చారు. అలా ఇండియాకు వచ్చిన గదర్ యోధుల దళం పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్‌పూరు కంటోన్మెంట్ చేరుకుంది. గదర్ పార్టీ నిర్ణయాల మేరకు సైనికులలో, ప్రజలలో తిరుగుబాటు భావాలను ప్రచారం చేస్తూ గదర్ భావాల వ్యాప్తికి ప్రసంగాలు చేస్తూ, తగిన సాహిత్య పంపిణీ తదితర కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాలను పర్యటిస్తున్న రహ్మాత్ అలీ ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్ నుండి మోగా ప్రాంతానికి వెళ్ళే ప్రయత్నంలో ఉండగా వారు వెళ్ళవలసిన రైలు తప్పిపోయింది. ఆ కారణంగా మోగా వెళ్ళేందుకు రహ్మాత్ అలీ మార్గదర్శకత్వంలో గదర్ దళం జట్కా బండ్లను మాట్లాడుకుని 1914 నవంబర్ 17న బయలుదేరింది. ఆ జట్కా బండ్లు మిసిరివాలా గ్రామం చేరుతుండగా బ్రిటిష్ ప్రభుత్వ పోలీసుల దళం అడ్డుకుంది. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణ, కాల్పులలో ఇరువురు గదర్ యోధులు, ఇరువురు పోలీసు అధికారులు మృతిచెందారు. ఆ ప్రాంతం నుండి తప్పించుకునే ప్రయత్నం విఫలం కావడంతో గదర్ దళం సభ్యులు అరెస్టు అయ్యారు. అనంతరం రహ్మాత్ అలీ మరియు ఇతరుల మీద పలు నేరారోపణలను నమోదు చేసి ఫిరోజ్‌పూర్ సెషన్స్ కోర్టులో 'ట్రయల్ నం. 4 ఆఫ్ 1915' (Trial No. 4 of 1915, in the court of Major B.O ROE, Session Judge, Ferozepur Division, at Ferozepur) కేసుగా విచారణ చేసారు. ఈ కేసులో రహ్మాత్ అలీ ఏడవ నిందితుడిగా పేర్కొనబడ్డారు. 1915 జనవరి 22న బ్రిటిష్ న్యాయస్థానం రెహమత్ అలీ, జీవన్ సింగ్, లాల్ సింగ్, జగత్ సింగ్‌లకు ఉరిశిక్ష విధించింది. 1915 మార్చి 25న ఆ శిక్ష మాంటిగోమరి జైలులో అమలుకావడంతో గదర్ యోధులు రహ్మాత్ అలీ వాజిద్‌కే అమరులయ్యారు. ✤

# ఇస్లామ్‌లో న్యాయ వ్యవస్థ




- మౌలానా ఉజైర్ ఫలాహీ

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ కాలంలో ఒక కులీన వంశానికి చెందిన మహిళ దొంగతనం చేసింది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ దొంగతనానికి చేతులు ఖండించే శిక్ష విధించారు. హదీసులో ఈ సంఘటన ఈ విధంగా ప్రస్తావనకు వచ్చింది.

"ఖురైషులు దొంగతనం చేసిన ఆ మహిళ విషయంలో సంప్రదింపులు జరిపారు. ఆమె విషయంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్‌తో ఎవరు మాట్లాడగలరని ఆలోచించారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ అమితంగా ఇష్టపడే ఉసామా బిన్ జైద్ రజిఅల్లాహు అన్హు తప్ప మరెవ్వరూ ఈ విషయమై ప్రవక్తగారితో మాట్లాడే ధైర్యం చేయలేరని నిర్ణయించుకున్నారు. వారి కోరికపై ఉసామా బిన్ జైద్ రజి అల్లాహు అన్హు వెళ్ళి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్‌తో ఆ మహిళ విషయంలో సిఫారసు చేశారు. ఇది విని ఆయన (స) ముఖారవిందం ఆగ్రహంతో కందిపోయింది. ప్రవక్త జవాబిస్తూ "నువ్వు అల్లాహ్ ఆదేశాల విషయంలో నాకు సిఫారసు చేస్తున్నావా?" అన్నారు. ఆ తర్వాత నిలబడి ప్రసంగిస్తూ "ప్రజలారా, మీ కన్నా ముందు జాతులు నాశనమైపోవడానికి కారణమేమిటో తెలుసా? వారు తమలోని కులీనుడు ఎవరైనా దొంగతనం చేస్తే వదిలేసేవారు. ఎవరైనా బలహీనుడు దొంగతనం చేస్తే శిక్ష విధించేవారు. అల్లాహ్ తోడు! నా కుమార్తె ఫాతిమా దొంగతనం చేసినా నేను ఇదే శిక్ష విధిస్తాను" అన్నారు. *(బుఖారీ, ముస్లిమ్)*

ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్

న్యాయం విషయంలో ఆదర్శంగా నిలబడ్డారు. న్యాయం విషయంలో సిఫారసులు, పలుకుబడులు, ఒత్తిళ్ళను పూర్తిగా నిషేధించారు. న్యాయాన్ని నిలబెట్టే విషయంలో ఇస్లామ్ తీసుకున్న చర్యల వల్ల దుర్మార్గులు, దౌర్జన్యపరులు భయపడ్డారు. దౌర్జన్యం ప్రళయదినం నాటి చీకట్లలో ఒకటని ఇస్లామ్ నిర్ధారించింది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా అన్నారు:

"దౌర్జన్యానికి దూరంగా ఉండండి. దౌర్జన్యపరుడికి చీకటి మాత్రమే ఉంటుంది." *(ముస్లిమ్)*

## ప్రభుత్వం వేరు, న్యాయవ్యవస్థ వేరు

ప్రభుత్వం ప్రజల జీవిత రంగాలన్నింటినీ శాసిస్తుంది. ప్రభుత్వం ద్వారా పాలకుడు ప్రజలను న్యాయంగా పాలిస్తాడు. న్యాయానికి కట్టుబడతాడు. కాని న్యాయవ్యవస్థ వేరు. న్యాయవ్యవస్థ ప్రజల్లో వివాదాల విషయంలో నిర్ణయాలు తీసుకుంటుంది. షరీఅత్ స్పష్టంగా ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయాలు ఉంటాయి. అంటే, వివాదం మొదలైనప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థ జోక్యం ఉంటుంది. అప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థ పని ప్రారంభమవుతుంది. ఎవరన్నా వ్యక్తి చట్టాన్ని కాదని దౌర్జన్యానికి పాల్పడితే అప్పుడు అతడిని న్యాయమూర్తి వద్దకు తీసుకెళ్ళడం జరుగుతుంది. న్యాయమూర్తి ఇస్లామీయ షరీఅత్ ప్రకారం తన తీర్పు చెబుతాడు. న్యాయమూర్తి నిర్ణయాన్ని ప్రభుత్వం అమలు చేయవలసి ఉంటుంది.

## ఫత్వా - న్యాయవ్యవస్థ

ఫత్వా అనేది న్యాయవ్యవస్థకు విభిన్నమైనది. ఫత్వా విషయంలో చర్యలు తీసుకోవలసిన అవసరం ఉండదు. ఫత్వా ఇచ్చే యోగ్యత ఉన్న 'ముఫ్తీ' వద్దకు ప్రశ్న వస్తే చాలు. తన కాలంలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రశ్నించడం సరిపోతుంది. 'ముఫ్తీ' (ధార్మిక తీర్పు ఇచ్చే వ్యక్తి) ఆ ప్రశ్నకు సమాధానమిస్తాడు. ఖాజీ లేదా న్యాయమూర్తిని ఇలా ప్రశ్నించడం ఉండదు. ఫత్వాలోనే ఇలా ప్రశ్నించడం దానికి జవాబీయడం ఉంటుంది. అలాగే న్యాయమూర్తి ఆరాధనల విషయంలో ఫత్వాలివ్వడు. కాని ముఫ్తీ అంటే ఫత్వా ఇచ్చే యోగ్యత ఉన్న ధర్మవేత్త అన్ని ప్రశ్నలకు సమాధానాలిస్తాడు. ప్రజలకు అవసరమైన హితబోధ చేస్తాడు. కాని నేరస్థులను శిక్షించే అధికారం ముఫ్తీకి లేదు. ఈ అధికారం ఖాజీ (న్యాయ మూర్తి)కి మాత్రమే ఉంది.

## న్యాయవ్యవస్థ

ఇస్లామీయ రాజ్యంలో అనేక సంస్థలుంటాయి. న్యాయాన్ని నిలబెట్టడానికి, ఇస్లామీయ షరీఅత్‌కు ప్రజలు కట్టుబడి వ్యవహరించేలా చేయడానికి ఏర్పడిన సంస్థ న్యాయవ్యవస్థ. ఇస్లామ్ స్వతంత్ర న్యాయవ్యవస్థను ప్రతిపాదించింది. అంతకు ముందు స్వతంత్ర న్యాయవ్యవస్థ అనేది ప్రపంచంలో మనకు కనబడదు. న్యాయవ్యవస్థలో అనేక విభాగాలున్నాయి. ఉదాహరణకు ఖజాఅత్ (న్యాయ విభాగం), పోలీస్, విమర్శనా విభాగం (ఇస్లామీయ రాజ్యంలో ప్రజల జీవితం, జీవన వ్యవహారాలను పర్యవేక్షించే అధికారి కూడా ఉంటాడు). నేర విభాగం వగైరా ఉంటాయి.

## ఇస్లామీయ న్యాయవ్యవస్థ చరిత్ర

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇస్లామీయ రాజ్యంలో మొదటి పాలకుడు, మొదటి న్యాయమూర్తి. అల్లాహ్ స్వయంగా ఆయనకు ఈ ఆదేశమిచ్చాడు. దివ్యఖుర్‌ఆన్ ఇలా ప్రకటించింది:

**"కనుక ప్రవక్తా! నీవు అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం ప్రజల వ్యవహారాలను పరిష్కరించు. వారి కోరికలను అనుసరించకు. మిమ్మల్ని వారు మోసంలో పడవేసి అల్లాహ్ మీ వద్దకు పంపిన ఉపదేశానికి రవ్వంత కూడా విముఖులను చెయ్యకుండా మీరు అప్రమత్తులై ఉండండి."** (అల్ మాయిద: 49)

దివ్యఖుర్‌ఆన్‌లో మరో చోట అల్లాహ్ ఇలా తెలియజేశాడు:
**"ప్రవక్తా! అల్లాహ్ నీకు చూపిన రుజుమార్గానికి అనుగుణంగా నీవు ప్రజల మధ్య తీర్పు చెయ్యటానికి మేము ఈ గ్రంథాన్ని సత్యంతో నీ వద్దకు పంపాము. నీవు నీతిలేనివారి తరఫున వాదిగా నిలబడకు."** (నిసా: 105)

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ తన ప్రతినిధులను న్యాయమూర్తులుగా నియమించి దూరప్రాంతాలకు పంపించేవారు. ముఆజ్ బిన్ జబల్ రజిఅల్లాహు అన్హును న్యాయమూర్తిగా నియమించి ఎమన్ పంపించారు. ఇతాబ్ బిన్ అసీద్‌ను మక్కాకు ఖాజీగా నియమించారు. ఖాజీలను నియమించి వారిని పంపించే ముందు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి హితబోధ చేసేవారు. అలీ బిన్ అబీ తాలిబ్ రజిఅల్లాహు అన్హూ కు ఇలా హితబోధ చేశారు:

"అలీ, నీ వద్దకు ఇద్దరు కక్షిదారులు వస్తే ఎవరో ఒకరి మాట మాత్రమే విని తీర్పు చెప్పవద్దు. ఇద్దరి వాదనలు వినాలి. అలా చేయడం వల్ల తీర్పు చెప్పడం నీకు సులభమవుతుంది."

*(అహ్మద్, అబూదావూద్, తిర్మిజి)*




# హిజాబ్‌పై మళ్ళీ రభస

- రూహి

**మళ్ళీ హిజాబ్‌పై** మరో రభస ప్రారంభమయ్యింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాజకీయాలన్నీ మతం చుట్టు, ముఖ్యంగా ముస్లిముల మతాచారాలు, సంప్రదాయాల చుట్టు మాత్రమే తిరుగుతుంటాయి. ఈసారి రాజస్థాన్‌లోని హవామహల్ బీజేపీ ఎమ్మెల్యే బాలముకుంద్ ఆచార్య వివాదాస్పద వ్యాఖ్య చేశాడు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఒక స్కూలును సందర్శించిన ఆచార్య అక్కడ కొందరు ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి ఉండడం చూసి అభ్యంతరాలు పెట్టాడు. కాషాయ దుస్తులు ధరించి చట్టసభకు వెళ్ళే ఈ సభ్యుడు ముస్లిం బాలికలు హిజాబ్ ధరించడంపై మాత్రం అభ్యంతరాలు పెడుతున్నాడు. ఇప్పుడొక రాజస్థాన్ మంత్రిగారు ముందుకు వచ్చి ముస్లిముల్లో మతతత్వం ఎక్కువగా ఉందని, కాంగ్రెసు బుజ్జగింపు రాజకీయాలు చేసిందని అందువల్లనే ముస్లిం సముదాయం అభివృద్ధి సాధించలేకపోతుం దని అన్నాడు. ముస్లిముల గురించి ఈ మంత్రిగారు వివాదా స్పద వ్యాఖ్యలు చేయడమే కాదు, స్కూళ్ళలో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తామని చెప్పాడు. కర్నాటకలోను బీజేపీ ప్రభుత్వం ఇదే చేసింది. దేశంలో ఇప్పుడు ఇవే రాజకీయాలు నడుస్తున్నాయి.

కర్నాటకలోని ఉడిపిలోని ఓ ప్రభుత్వ కళాశాలలో హిజాబ్ వివాదం మొదలై క్రమంగా చిలికి చిలికి గాలివానైంది. దేశంలోని నలుమూలలకూ దావానలంలా వ్యాపించింది. విద్యా సంస్థలను మతానికి దూరంగా ఉంచాలని కొందరంటున్నారు. దేశం ముఖ్యమా, మతం ముఖ్యమా అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. విద్య ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఆ విద్యార్థినులు తమ ధార్మిక విశ్వాసాన్ని వదిలేయాలని ఇంకొందరు సలహా ఇస్తు న్నారు. మరోవైపు కొందరు ఆ విద్యార్థినులకు మద్దతుగా ముందుకు వస్తున్నారు. ఈ అమ్మాయిలు మొదటి నుంచి హిజాబ్ ధరించి వస్తున్నప్పుడు హఠాత్తుగా ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటు న్నారని కళాశాల ఆకస్మిక నిర్ణయాన్ని ప్రశ్నిస్తున్నారు. అసలు ముస్లిం బాలికలు ఎందుకు హిజాబ్ విషయమై పట్టుపడుతు న్నారు? ఇస్లాంలో దాని ప్రాముఖ్యత ఏమిటి? అనే విషయాలు అర్థం చేసుకోవడం ముఖ్యం.

హిజాబ్ కేవలం ముస్లింల సమస్య మాత్రమేనా? ఈ అంశానికి మతం రంగు పులిమిన వారు ఇది ముస్లింల ఛాందసవాదానికి నిదర్శనంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా ముస్లింలు తమ మహిళలను హిజాబ్ ధరిం చేలా బలవంతం చేస్తున్నారని, ఇది మహిళలపై దౌర్జన్యమనీ, వారి పురోగతికి అతిపెద్ద అడ్డంకి అని వాదిస్తున్నారు. వాస్తవ మేమిటంటే, హిజాబ్ మహిళలపై దౌర్యన్యమైతే ఇతర మతాలలో కూడా ఇది కనబడుతుంది. ఇస్లాం మాదిరిగా క్రైస్తవ,యూద మతాల్లో కూడా ఏదో ఒక రూపంలో హిజాబ్ కనిపిస్తుంది. స్త్రీ

సహజమైన లజ్జ, సౌశీల్యాలతో పాటు ధర్మనిష్ఠకు నిదర్శనంగా భావించబడుతుంది.

మేరీమాత విగ్రహం ఎక్కడైనా హిజాబ్ వంటి వస్త్రధారణలోనే కనిపిస్తుంది. క్రైస్తవ మతంలో హిజాబ్ ప్రాముఖ్యతకు ఇదొక నిదర్శనం. హిజాబ్ చాలా వరకు అంతరించిపోయిన తర్వాత కూడా చర్చిలో మహిళలు ఇప్పటికీ తమ తలను కప్పుకుంటారు. మహిళా మతాధికారులు తమ శరీరాన్ని పూర్తిగా కప్పుతారు. యూదమతంలో వివాహిత స్త్రీలు తమ జుట్టును నిరాడంబరంగా కప్పుకోవడం ఆచారం. యూదు మహిళలు ఇప్పటికీ తలపై స్కార్ఫ్ ధరిస్తారు. ఇస్లాం రాకముందు భారతదేశం హిజాబ్ గురించి తెలియని ప్రాంతమేమీ కాదు. యాభై సంవత్సరాల క్రితం భారతదేశాన్ని పరిశీలిస్తే అప్పట్లో స్త్రీలు ఘూంఘట్ (తలపై కప్పుకునే పైట) ధరించేవారు. ఇది నేటికీ చాలా గ్రామాలలో కనిపిస్తుంది. సిక్కు స్త్రీలలో తలపై కప్పుకునే ఆచారం ఇప్పటికీ కనిపిస్తుంది. పైటతో తలపై, ముఖాన్ని కప్పుకోవడానికి మహిళలు ప్రయత్నించడం నేడు కూడా చూడవచ్చు. పెళ్లి తర్వాత ముదిఖాయీ వంటి ఆచారాలను పరిశీలిస్తే ఇంటి కోడలు పైటతో తల, ముఖం కప్పి ఉంచుకునే సంప్రదాయం అర్థమవు తుంది. 2016లో SARI నిర్వహించిన సర్వే ప్రకారం, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో 26 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీలు 60% కంటే ఎక్కువ మంది ఘూంఘట్ ధరిస్తారని తెలిసింది.

హిజాబ్‌ను ఇస్లాం కనిపెట్టలేదు. ఇది ఎప్పటి నుంచో కొన సాగుతూ వస్తున్న వ్యవస్థ. ఇస్లాం దాని అవసరాన్ని, ప్రాము ఖ్యతను గుర్తించి దాన్ని కొనసాగింది. ఇస్లామీయ సామాజిక వ్యవస్థలో దాన్ని భాగం చేసింది. ఇస్లాం లక్ష్యం ఆదర్శప్రాయమైన, ఉత్తమ సమాజాన్ని స్థాపించడం. అందుకోసం స్త్రీపురుషుల మధ్య సంబంధాన్ని చాలా ఖచ్చితంగా నిర్వచించింది. స్త్రీపురుష సంబంధాలను సభ్యత, మర్యాదల పరిధుల్లో ఉంచింది. ఈ పరిధులు నిర్దేశించకపోతే సమాజం అతలాకుతలం అవుతుం దనీ, అణచివేత, లైంగిక దోపిడీల తుఫాను సమాజాన్ని నాశనం చేస్తుందని ఇస్లాం భావిస్తుంది. అందువల్ల ఇస్లాం స్త్రీపురుషులు ఇద్దరికీ ఖచ్చితమైన పరిమితులు విధించింది.

## ఆ పరిమితులు ఏమిటంటే -

**చూపుల భద్రత:** అనవసరంగా ఒకరినొకరు చూడరాదు. దారిలో ఉన్న యువతిని తదేకంగా చూడటం అనే జబ్బు ప్రస్తుత కాలంలో చాలా మంది పురుషులను పట్టుకుని వేధిస్తున్న జబ్బు. పైగా దీన్ని పెద్ద తప్పుగా కూడా భావించడం లేదు. సామాజిక పతనానికి ఇది మొదటి మెట్టుగా ఇస్లాం భావిస్తుంది. దీనిని నివారించడానికి, దివ్యఖుర్ఆన్ చూపులను కాపాడుకోవాలని ఆదేశించింది. ఈ ఆదేశం మొదట పురుషులు తరువాత స్త్రీలకు ఇవ్వబడింది. **"తమ చూపులను కాపాడుకోవాలని, జననాంగా లను రక్షించుకోవాలని విశ్వాసులైన పురుషులకు చెప్పు"…. "వారి కళ్లను సురక్షితంగా ఉంచుకోవాలని, జననాంగాలను కాపాడుకోవాలని చెప్పండి."** (ఖురాన్ 24:30-31). అంటే అర్థం ఎవరైనా పరాయి స్త్రీ పై చూపులు పడితే వెంటనే చూపులు తిప్పుకోవాలి. ప్రవక్త ముహమ్మద్ (స) ఒక స్త్రీని అనవసరంగా చూడడాన్ని జినా (వ్యభిచారం)గా అభివర్ణించారు.

## అలంకరణను దాచుకోవడం

మహిళలు అలంకరించుకోడాన్ని ఇస్లాం నిషేధించదు. కానీ అలంకరణ ప్రదర్శించడాన్ని నిషేధిస్తుంది. ఇది పతనం దిశగా పెద్దఅడుగుగా పరిగణిస్తుంది. స్త్రీలు తమ అలంకరణను బహిర్గతం చేయకూడదని ఖురాన్ ఆదేశించింది. **"మీ దుపట్టాను మీ ఛాతీపై ఉంచండి మీ అలంకరణను మీ భర్తలు లేదా మీ తండ్రులు తప్ప మరెవరికీ బహిర్గతం చేయవద్దు.** (ఖురాన్ 24:31) ఛాతీపై దుపట్టా కప్పి ఉంచాల్సిన అవసరాన్ని, దానిని ఉల్లంఘించడం వల్ల తలెత్తే సమస్యలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారు. సమాజంలో చెడును ఆహ్వానించే ఈ తలుపులను ఇస్లాం ఖచ్చితంగా మూసివేయడానికి ప్రయత్నించింది.

## ముఖం, జుట్టు కప్పి ఉంచడం

మహిళలు ఇంటినుండి బయటకు వెళ్లాలనుకుంటే తమ ముఖం, జుట్టును కప్పి ఉంచాలని ఇస్లాం బోధిస్తుంది.**"ప్రవక్తా! నీ భార్యలకూ, నీ కూతుళ్లకూ, విశ్వాసుల స్త్రీలకూ తమ దుప్పట్ల కొంగులను తలపై వ్రేలాడతీసుకోమని చెప్పు వారు గుర్తింపబడ టానికీ, వేధింపబడకుండా ఉండేందుకూ ఇది ఎంతో సముచిత మైన పద్ధతి."** (ఖురాన్ 33:59). ఈ ఆదేశం మహిళలను వేధించడానికి కాదు వారి భద్రత కోసం ఇవ్వబడిందని స్పష్టంగా అర్థమవుతోంది. హిజాబ్ ధరించే మహిళలు, ధరించని మహిళ లను పరిశీలిస్తే హింసకు గురయ్యే అవకాశం ఎవరికి తక్కువగా ఉంటుందో అర్థం చేసుకోవడం కష్టం కాదు.

పైన పేర్కొన్న వాటితో పాటు ఈ క్రింది విషయాలు కూడా కలిపి పరిశీలిస్తే హిజాబ్ ప్రాముఖ్యతను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

## దుస్తులు వదులుగా ఉండాలి

- ధరించే దుస్తులు శరీర సౌష్టవాన్ని బహిర్గతం చేసేంత బిగువుగా ఉండరాదు.
- శరీరం కనిపించేలా దుస్తులు పారదర్శకంగా ఉండకూడదు. లైంగిక ఆకర్షణ కలిగించేలా దుస్తులు ఆకర్షణీయంగా ఉండకూడదు
- స్త్రీ పురుషులు ఒకరి దుస్తులు ఒకరు ధరించరాదు.

ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే, ఇస్లాం హిజాబ్‌ను తప్పనిసరిగా ఆదేశించింది. కేవలం సూచించలేదు. కాబట్టి, దాని ఉల్లంఘన దైవాదేశాల ఉల్లంఘనగా పరిగణించబడు తుంది. ఈ దైవాదేశాన్ని ఉల్లంఘించిన సమాజాల్లో స్త్రీలపై అణచివేత, దోపిడీల తలుపులు తెరుచుకున్నాయి. దేశంలో మహిళల పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బయటకు వెళ్ళిన కుమార్తె ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందే పరిస్థితి ఉంది. దినపత్రికల్లో రోజూ అత్యా చారాల వార్తలే కనిపిస్తున్నాయి. దేశంలో ప్రతి 16 నిమిషాలకు ఒక అత్యాచార ఘటన నమోదవుతున్న పరిస్థితి సాధారణం అని చెప్పలేం. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిం మహిళలు హిజాబ్ ధరించి తమను తాము రక్షించుకోవడానికి ప్రయత్నిస్తే దానిపై గగ్గోలు చేయడం ఉచితం కాదు.

హిజాబ్ మహిళలను కాపాడుతుంది. బలాన్నిస్తుంది. శరీర ప్రదర్శన నుంచి రక్షిస్తుంది: మహిళల అంగాంగ ప్రదర్శన ఇప్పుడు వ్యాపారంగా మారింది. ఇది లైంగిక దోపిడీకి అనేక కొత్త మార్గాలను తెరిచింది. మద్యం నుండి కార్ల వరకు వ్యాపార ప్రకటనల్లో అర్ధ నగ్న మహిళలను ఉపయోగించడం సర్వ సాధారణ మయ్యింది.

హిజాబ్ మహిళలకు అందం కంటే వారి తెలివితేటలు, వ్యక్తిత్వం, నైపుణ్యం ప్రవర్తనలకు ప్రాముఖ్యాన్నిస్తుంది. వ్యక్తిత్వం ఆధారంగా సంబంధాలను నిలబెడుతుంది. వారికి నిజమైన గుర్తింపును ఇస్తుంది. ఈ విధంగా మహిళ సమాజంలో సానుకూల పాత్రను పోషించగలదు.

పరుల చూపులు తమ శరీరంలోని వివిధ భాగాలను కొలిచే భయం నుంచి మహిళకు విముక్తినిస్తుంది హిజాబ్. ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థయిర్యాన్ని పెంచుతుంది.

హిజాబ్ ధరించిన స్త్రీతో మాట్లాడేటప్పుడు పురుషులు తమ పరిధిలో మర్యాదగా ఉంటారు. పరిధులు దాటే ప్రయత్నం చేయరు.

హిజాబ్ ధరించడం తన మతాదేశాలపై స్థిరంగా ఉండడానికి, ధార్మిక విధుల పట్ల నిబద్ధతను సూచించే ప్రకటన అవుతుంది.

స్త్రీలకు తమ శరీరాలను ప్రదర్శించే స్వేచ్ఛ ఉన్నట్లే, వారి శరీరా లను కప్పి ఉంచే స్వేచ్ఛ కూడా ఉండాలి. హిజాబ్ స్త్రీలకు ఈ స్వేచ్ఛను ఇస్తుంది.

మత స్వేచ్ఛ ప్రాథమిక హక్కు దేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 25–28లో ఇవ్వబడింది. హిజాబ్ ధరించడం అనేది ఈ ప్రాథమిక హక్కును ఉపయోగించుకోవడం.

## చదువు, ఉద్యోగాలకు హిజాబ్ అవరోధమా?

హిజాబ్ మహిళల ప్రగతికి, అభివృద్ధికి అడ్డంకి అనీ, ముస్లిం మహిళలు సామాజిక, కౌటుంబిక ఒత్తిడి వల్లనే హిజాబ్ ధరిస్తున్నారనే వాదన శోచనీయం. సమాజంలో ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ఈ ప్రచారం నిరాధారమైన భావన. కమలా సూరయ్య (గతంలో కమలా దాస్) ఒక ప్రసిద్ధ మలయాళ భాషా రచయిత్రి. హిజాబ్ గురించి తన అభిప్రాయాలను ఇలా రాశారు:

“నేను ఇస్లాం మతంలోని పరదా వ్యవస్థ ద్వారా ప్రభావితమైన తర్వాతనే ఇస్లాంను స్వీకరించాను. ఇది స్త్రీ గౌరవాన్ని పెంచు తుంది. ఆమె స్త్రీత్వాన్ని కాపాడుతుంది. ఇప్పుడు నాకు పరదా రక్షణ కవచం”

ఆస్ట్రేలియాకు చెందిన డాక్టర్. రాచెల్ వుడ్‌లాక్ హిజాబ్ గురించి ఇలా చెప్పారు:

“పశ్చిమ దేశాలలో చాలా మంది ముస్లిం మహిళలు తమ గుర్తింపులో భాగంగా హిజాబ్‌ను ధరించాలని ఎంచుకున్నారు. ఇది ఛాందసవాదం కానే కాదు.

నోబెల్ శాంతిబహుమతి గ్రహీత తవక్కుల్ కర్మాన్ ను ఆమె ధరించిన హిజాబ్ గురించి పత్రికలు ప్రశ్నించాయి. హిజాబ్ ప్రగతిబాటపై అడ్డంకి కదా అని అడిగారు. అప్పుడు ఆమె ఏమన్నారంటే:

“ప్రాచీన కాలంలో మనిషి నగ్నంగా ఉండేవాడు. క్రమంగా అభివృద్ధితో పాటు బట్టలు ధరించడం ప్రారంభమయ్యింది. నేను నేడు ధరిస్తున్నది మనిషి సాధించిన ప్రగతి పరాకాష్ఠకు చెందిన ఆలోచనల స్థాయికి చెందినది. ఈ స్థాయిని మనిషి సాధించాడు. ఇది తిరోగమనం కాదు. హిజాబ్‌ను తీసివేయడం ఆ ప్రాచీన యుగానికి తిరోగమించడం అవుతుంది.

నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక ప్రకారం, 2008-2018 కాలంలో 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయసున్న ముస్లిం బాలికల విద్యా భాగస్వామ్యం 6.7% నుంచి 13.5%కి పెరిగింది. హిజాబ్ విద్యాభ్యాసానికి అడ్డంకి కాదని చెబుతున్న వాస్తవాలివి.

అలాగే ముస్లిం బాలికలు పురోగమించాలనుకుంటున్నారు. కాని హిజాబ్‌పై నిషేధం ముస్లిం అమ్మాయిల విద్యాభ్యాసానికి అతిపెద్ద అడ్డంకిగా మారుతుంది. ఇస్లాం స్త్రీలకు అన్ని రకాల ఆర్థిక బాధ్యతల నుండి స్వేచ్ఛను ప్రసాదించింది. అయితే ఏవయిన కారణాల వల్ల స్త్రీ ఉద్యోగం లేదా వ్యాపారం చేయాలనుకుంటే ఇస్లాం ఆమెను అడ్డుకోదు. ఆమె హిజాబ్ ధరించి ఈ బాధ్యతను సులభంగా నిర్వర్తించగలదు.

## సమాజసేవకు, దేశసేవకు హిజాబ్ అడ్డంకి కాదు

దేశానికి సేవ చేసే పనిలో హిజాబ్ ఎప్పుడూ ఆటంకం కాలేదు. సంకుచిత ఆలోచనే అసలు అడ్డంకి. అందరికీ సమానావకాశాలనే మాటలు చెప్పే సమాజం హిజాబ్ ధరించిన మహిళకు అడుగడుగునా కొత్త అడ్డంకులను సృష్టిస్తుంది.

హిజాబ్‌ను సమర్థించడం నిజానికి అన్ని మతాల బోధనలు ఆదర్శాలకు ఆమోదం తెలుపడం. ప్రస్తుతం ముస్లింలలో హిజాబ్ ఎక్కువగా కనిపిస్తుందనే కారణంతో దాన్ని వ్యతిరేకించడంలో విజ్ఞత లేదు. అందరికీ మేలు చేసే బోధనను అంగీకరించడం తెలివైన పని. ఇందులోనే దేశానికి సమాజానికి ప్రయోజనం ఉంది. ఇది నేటి అవసరం. ✤


# ఖుర్ఆన్ అవగాహనం (తఫ్‌హీముల్ ఖుర్ఆన్)

(1 నుండి 10వ సంపుటం వరకు వివరాలు)

| సంపుటం | సూరా పేర్లు | సూరాలు | పేజీలు | హద్య |
|---|---|---|---|---|
| 1. | 1. అల్ ఫాతిహా 2. అల్ బకర 3. ఆలి ఇమ్రాన్ | 3 | 266 | 450-00 |
| 2. | 4. అన్ నిసా 5. అల్ మాఇద 6. అల్ అన్ఆమ్ | 3 | 268 | 300-00 |
| 3. | 7. అల్ ఆరాఫ్ 8. అల్ అన్ఫాల్ 9. అత్ తౌబా 10. యూనుస్ 11. హూద్ 12. యూసుఫ్ | 6 | 440 | 300-00 |
| 4. | 13. అర్ రా'ద్ 14. ఇబ్రాహీమ్ 15. అల్ హిజ్ర్ 16. అన్ నహ్ల్ 17. బనీ ఇస్రాయీల్ 18. అల్ కహ్ఫ్ 19. మర్యమ్ 20. తాహా 21. అల్ అన్బియా | 9 | 424 | 400-00 |
| 5. | 22. అల్ హజ్జ్ 23. అల్ మూ'మినూన్ 24. అన్ నూర్ 25. అల్ ఫుర్కాన్ 26. అష్ షుఅరా 27. అన్ నమ్ల్ | 6 | 422 | 250-00 |
| 6. | 28. అల్ కసస్ 29. అల్ అన్కబూత్ 30. అర్‌రూమ్ 31. లుక్మాన్ 32. అస్ సజ్దా 33. అల్ అహ్జాబ్ 34. సబా 35. ఫాతిర్ | 8 | 424 | 400-00 |
| 7. | 36. యాసీన్ 37. అస్‌సాఫ్ఫాత్ 38. సాద్ 39. అజ్ జుమర్ 40. అల్ మూ'మిన్ 41. హామీమ్ అస్ సజ్దా 42. అష్ షూరా 43. అల్ అహ్కాఫ్ 44. అద్ దుఖాన్ 45. అల్ జాసియహ్ 46. అల్ అహ్కాఫ్ 47. ముహమ్మద్ | 12 | 456 | 400-00 |
| 8. | 48. అల్‌ఫత్హ్ నుండి 59. అల్ హష్ర్ | 12 | 408 | 400-00 |
| 9. | 60. అల్ ముమ్తహీన నుండి 77 అల్ ముర్సలాత్ | 18 | 412 | 400-00 |
| 10. | 78 అన్ నబా నుండి 114 అన్ నాస్ వరకు | 37 | 420 | 400-00 |

3,700-00

డిస్కౌంటు తరువాత
2,220-00

TELUGU ISLAMIC PUBLICATIONS TRUST
Central Bank of India, Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407

మరిన్ని వివరాలకు సంప్రదించండి: ✆ 9700255736

పోస్టల్ చార్జీలు అదనం

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

40– 43 దౌష్ట్యానికి ప్రతీకారం, అటువంటి దౌష్ట్యమే, మరెవరయితే క్షమించివేసి సంస్కరిస్తారో వారి ప్రతిఫలం ఇవ్వడం అల్లాహ్ బాధ్యత, అల్లాహ్ అత్యాచారం చేసే వారిని ఇష్టపడడు.[67] మరెవరయితే అత్యాచారం జరిగిన తరువాత ప్రతీకారం తీర్చుకుంటారో వారిని నిందించడం తగదు; నిందార్హులయిన వారయితే ఇతరులపై దౌర్జన్యం చేసేవారు, భువిలో అధర్మంగా అత్యాచారాలు జరిపేవారు. ఇలాంటి వారికి వ్యధాభరిత మయిన శిక్ష పడుతుంది. ఇంతకూ సహనంతో వ్యవహరించే, మన్నింపు వహించే వ్యక్తి విషయమయితే ఉన్నత సంకల్పనిరతి, సాహసోపేతమయిన చర్యలలోని మాటే.[68]

44 – 46 ఎవరినయితే అల్లాహ్ మార్గవిహీనతలో పడవేస్తాడో అతడిని ఆదుకునేవాడు అల్లాహ్ తరువాత మరెవడూ లేడు.[69] నీవు గమనిస్తావు, ఈ దుర్మార్గులు శిక్షను చూసినప్పుడు అంటారు, ఇప్పుడు మరలే మార్గమేదయినా ఉందా అని.

67. ఈ హెచ్చరికలో ప్రతీకారానికి సంబంధించిన మూడవ నియమాన్ని సూచించడం జరిగింది. ఎవరయినా ఇతరులు చేసిన అత్యాచారానికి బదులు తీర్చుకుంటూ స్వయంగా తానూ అత్యాచారిగా రూపొందరాదు. ఒక చెడుగుకు బదులు అంత కన్నా అధికంగా చెడుగు చెయ్యడం ధర్మసమ్మతం కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఎవరికయినా ఒక చెంప దెబ్బ కొడితే అతను ఆ వ్యక్తికి ఒకే చెంపపెట్టునివ్వాలి, అంతేగాని తన్నులతో, ముష్టిదెబ్బలతో కొట్టడానికి వీలులేదు. అలాగే పాపానికి ప్రతిగా పాపం చెయ్యడమూ సరయినది కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి కొడుకును ఒక దుర్మార్గుడు చంపి వేసినట్లయితే ఆ వ్యక్తి ఆ దుర్మార్గుని కొడుకును చంపడం ధర్మసమ్మతం కాదు. లేదా ఒక వ్యక్తి చెల్లిని లేదా కూతురిని ఎవరయినా నీచుడు చెరిచినట్లయితే అతను ఆ నీచుని చెల్లితో లేదా కూతురితో వ్యభిచరించడం ధర్మసమ్మతం కాదు.

68. ఒక విషయం బాగా విశదంగా తెలుసుకోవాలి. ఈ ఆయత్‌లలో విశ్వసించేవారి ఏ గుణగణాలనయితే తెలుపడం జరిగిందో అవి ఆ రోజుల్లో ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్), ఆయన సహచరుల జీవితాలలో ఆచరణా త్మకంగా కానవస్తూ ఉండేవి, మక్కా తిరస్కారులు తమ కళ్ళారా వాటిని వీక్షిస్తూ ఉండేవారు. ఈ విధంగా అల్లాహ్ వాస్తవానికి తిరస్కారులకు చెప్పిందేమిటంటే, ఇహ లోకపు మూణ్ణాళ్ళ జీవితం గడపడానికి ఏ సామగ్రినయితే పొంది మీరు తమ్ముతాము మరచిపోయి పొంగి పొరలుతున్నారో అది నిజమయిన సంపద కాదు. అసలు సంపద ఈ నైతికత, ఈ లక్షణాలే. దివ్య ఖుర్‌ఆన్ మార్గదర్శకత్వం పొంది, మీ సమాజానికే చెందిన ఈ విశ్వాసులు వీటిని తమలో పెంపొం దించుకున్నారు.

69. భావమేమిటంటే, అల్లాహ్ ఖుర్‌ఆన్ లాంటి ఉత్తమ గ్రంథాన్ని జనుల మార్గబోధనకు పంపాడు. ఇది అత్యంత సమంజసమయిన, ఎంతో ప్రభావవంతమయిన, మరెంతో మనోజ్ఞమయిన రీతిలో వీరికి యధార్థాన్ని గురించి జ్ఞానం అందజేస్తోంది, జీవితపు సరయిన మార్గాన్ని చూపుతోంది. దైవ సందేశహరుడు మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) వంటి ప్రవక్తను వారి మార్గదర్శకత్వం కొరకు పంపాడు. ఆయనకన్నా ఉత్తమ చరిత్ర, శీల స్వభావాల మనిషి వారికి ఎన్నడూ కానరాలేదు. ఈ గ్రంథం, ఈ సందేశ హరుని బోధనలు, శిక్షణల ఫలితాలు సయితం విశ్వసించే వారి జీవితాలలో అల్లాహ్ వారికి చూపెట్టాడు. ఎవరయినా ఇదంతా చూసినప్పటికీ మార్గబోధనకు విముఖుడయినట్ల యితే అల్లాహ్ మరి అతన్ని ఆ మార్గవిహీనతలోనే పడ వేస్తాడు, దాన్నుండే అతను అసలు బయటపడటానికీ ఇష్ట పడటం లేదు గనక. మరి అల్లాహ్ స్వయంగా అతన్ని తన ద్వారం నుండి తరిమి వేసినప్పుడు అతన్ని సన్మార్గాన తీసుకు వచ్చే బాధ్యతను ఎవరు నెత్తిన వేసుకుంటాడు?

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా॰ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

**361)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) తెలిపారు: అహ్జాబ్(కందక) యుద్ధ సందర్భంగా నన్నూ, అమ్ర్ బిన్ అబీ సలమా(రజి)ను స్త్రీల మధ్యన వదలి వెళ్ళటం జరిగింది (ఎందుకంటే అప్పటికి మేము పిన్న వయస్కులం). అకస్మాత్తుగా నా దృష్టి హజ్రత్ జుబైర్– రజిపై (నా తండ్రిపై) పడింది. ఆయన గుర్రంపై స్వారీ అయి బనీ ఖురైజా (యూదు తెగ) వైపునకు వస్తూ పోతూ ఉన్నారు. రెండు లేక మూడు సార్లు ఇలా జరిగింది. (యుద్ధం ముగిసి) నేను తిరిగి వచ్చిన తరువాత, 'నాన్నా! నేను మిమ్మల్ని అనేకసార్లు రాకపోకలు సాగిస్తూ ఉండగా గమనించాను. ఏమిటి విశేషం?' అని అడిగితే, "ఒరేయ్ చంటీ! నిజంగానే నీవు నన్ను చూశావా?" అని ఆయన అడిగారు. నేను 'అవున'న్నాను. అప్పుడాయన ఇలా వివరించారు : "బనూ ఖురైజా వద్దకు వెళ్ళి, వారి కదలికల్ని పసిగట్టి, ఆ సమాచారం నాకు చేరవేసే వారెవరు?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించినప్పుడు, చిత్తం అంటూ నేను అక్కడికి వెళ్ళి ఆ రహస్య సమాచారాన్ని దైవప్రవక్త(స)కు చేరవేశాను. అప్పుడు దైవప్రవక్త(స) సంతోషాతిశయంతో తన తల్లిదండ్రుల్ని ప్రస్తావిస్తూ, "నా తల్లిదండ్రులు నీపై ఫిదా" అని పలికారు.

**362)** హిషామ్ బిన్ ఉర్వా తెలిపారు: ఈయన గార్కి ఈయన తండ్రి తెలియజేశారు: యర్మూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త ప్రియ సహచరులు, జుబైర్ బిన్ అవ్వామ్(రజి)తో, "మీరు పరాక్రమం చూపరేమిటి? మీరు గనక పరాక్రమం చూపితే, మీతోపాటే మేము కూడా మెరుపు దాడి చేస్తాము" అని విజ్ఞప్తి చేశారు. అప్పుడు ఆయన (రోమనులపై) దాడికి దిగారు. ఆ సందర్భంగా రోమనులు ఆయన భుజాలపై రెండుసార్లు ఖడ్గపు వ్రేటు వేశారు. ఆ రెండు గాయాల మధ్య బద్ర్ యుద్ధ సందర్భంగా గాయపడిన మచ్చ కూడా ఉండేది. ఉర్వా ఇలా అంటున్నారు : ఆ గాయాలు ఎంత లోతైనవంటే (ఆయన కోలుకున్న తర్వాత)– పసితనంలో– నేను ఆ గాయాలలో వ్రేళ్ళు పెట్టి ఆడుకునేవాణ్ణి.

### అధ్యాయం : 15

### మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) గురించి[1]

దైవప్రవక్త (సఅసమ్) తన మరణ కాలం వరకు ఈయన పట్ల సంతుష్టులై ఉన్నారని హజ్రత్ ఉమర్(రజి) చెప్పారు.

**365)** ఖైస్ బిన్ అబీ హాజిమ్ తెలిపారు : "మహనీయ తల్హా (రజి) గారు (ఉహుద్ యుద్ధంలో) దైవప్రవక్త(స)ను రక్షించడానికి అడ్డుగా పెట్టిన ఆయన చేతిని చూశాను. అది పూర్తిగా పనికిరాకుండా పోయి ఉంది."

15-1. ఈయన ఖురైషీ. ఈయన కునీయత్ అబూ ముహమ్మద్. స్వర్గలోక శుభవార్త ప్రపంచంలోనే వినిపించబడిన అష్రె ముబష్షిరాలో ఒకరు. ఉహుద్ యుద్ధంలో ఈయన దైవ ప్రవక్త(స) ముఖారవిందానికి గాయం అవకుండా ఉండేందుకు తన రెండు చేతుల్ని 'డాలు'గా అడ్డం పెట్టారు. చేతులపై 75 గాయాలయ్యాయి. చేతివ్రేళ్ళు చచ్చుబడిపోయాయి. అయినా దైవప్రవక్త(స) మోముపై దెబ్బపడకుండా ఉండేందుకు మొక్కవోని సాహసంతో నిలబడ్డారు.

హజ్రత్ తల్హా (రజి) సుందర స్వరూపులు. శరీరం గోధుమ వర్ణంలో ఉండేది. జమల్ యుద్ధంలో అమరగతి నొందారు. అప్పటికి ఆయన వయసు 64 సంవత్సరాలు.

★★★

ముహమ్మద్ వహీదుద్దీన్

# దివ్య ఖుర్ఆన్ నేర్పిన "దుఆ"లు



**'దుఆ'** అంటే వేడుకోలు. అల్లాహ్‌తో అర్థించటం, మొరపెట్టుకోవడం. తనకు వచ్చిన బాధలను, కష్టాలను, విపత్తులను అల్లాహ్‌తో చెప్పుకొని సహాయం కోరటం.

దుఆ విశ్వాసికి దైవమిచ్చిన గొప్ప వరం. అన్ని దారులు మూసుకుపోయినప్పుడు, అన్ని ఆధారాలు పూర్తిగా కోల్పోయినప్పుడు, అన్ని ఆశలు పాతాళంలో అడుగంటిపోయినప్పుడు మనిషికి దుఆ ఒక్కటే సహాయపడుతుంది, ఆదుకుంటుంది. కాబట్టి కొన్ని 'దుఆ'ల గురించి తెలుసుకుందాం-

ఇహపర లోకాల సాఫల్యం కోసం చేసే దుఆ..

ఓ మా ప్రభూ! మాకు ఇహలోకంలో కూడా మేలును ప్రసాదించు. పరలోకంలో కూడా మేలునే ప్రసాదించు. నరకాగ్ని జ్వాలల నుంచి మమ్మల్ని కాపాడు. (దివ్య ఖుర్ఆన్ 2: 201)

నూహ్ (అలైహిస్సలామ్) దుఆలు..

ఓ మా ప్రభూ! నన్ను శుభప్రదమైన స్థలంలో దించు. నీవు స్థలం ఇచ్చే వారిలో ఉత్తముడవు. (దివ్య ఖుర్ఆన్ 23: 29)

ఓ నా ప్రభూ! నేను నిస్సహాయుణ్ని. కనుక నీవు నాకు సహాయం చెయ్యి. (దివ్య ఖుర్ఆన్ 54: 10)

దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అలై) చేసిన దుఆలు

నా ప్రభువు తప్పకుండా ప్రార్థనలను ఆలకిస్తాడు. ఓ నా ప్రభూ! నన్ను నమాజును స్థాపించేవాడుగా చెయ్యి. నా సంతతిలో కూడా (ఈ పని చేసేవాళ్ళను లేపు) ప్రభూ! నా ప్రార్థనను స్వీకరించు. ఓ నా ప్రభూ! నన్నూ, నా తల్లిదండ్రుల్నీ, విశ్వసించే వారందరినీ లెక్క ఖరారు అయ్యేరోజున క్షమించు. (దివ్య ఖుర్ఆన్ 14: 39-41)

ఆయనే నన్ను పుట్టించాడు, ఆయనే నాకు మార్గదర్శకత్వాన్ని నెరుపుతున్నాడు. ఆయనే నాకు అన్నం పెడుతున్నాడు. నీళ్లు త్రాపుతున్నాడు. నేను అనారోగ్యానికి గురైనప్పుడు ఆయన నాకు స్వస్థతను ప్రసాదిస్తాడు. ఆయనే నన్ను హతమారుస్తాడు. ఆ తరువాత ప్రాణం పోసి లేపుతాడు. ప్రళయదినం నాడు నేను చేసిన పాపాలను మన్నిస్తాడని నేను ఆయనపై ఆశలు పెట్టుకున్నాను. (దివ్య ఖుర్ఆన్ 26: 78-82)

ఓ నా ప్రభూ! నాకు తీర్పు చెప్పే శక్తిని ప్రసాదించు. నన్ను సజ్జనులలో కలిపి వెయ్యి. (అష్షూరా : 83)

తరువాత రాబోయే తరాల వారిలో నాకు పేరు ప్రతిష్ఠలను ప్రసాదించు. (అష్షూరా : 84)

ఇంకా సుఖవంతమైన, సౌభాగ్యవంతమైన స్వర్గవనాలకు

వారసులైన వారిలో చేర్చు (అష్షూరా : 85)

ఓ నా ప్రభూ! సౌమ్యులు, సౌశీల్యవంతులు అయిన సంతానాన్ని నాకు ప్రసాదించు. (అస్ సాఫ్ఫాత్ : 100)

ఓ మా ప్రభూ! మేము నిన్నే నమ్ముకున్నాము. నీ వైపునకే మేము మరలి వచ్చాము. నీ సన్నిధికే మేము మరలిరావలసి ఉన్నది (ముమ్తహినహ్ : 4)

ఓ మా ప్రభూ! అవిశ్వాసుల పరీక్షకు మమ్మల్ని గురిచెయ్యకు. ప్రభూ! మేము చేసిన తప్పుల్ని మన్నించు. నిస్సందేహంగా నీవే శక్తి సంపన్నుడవు. మహా వివేకవంతుడవు. (ముమ్తహినహ్ : 5)

దైవప్రవక్త హ్జ్రత్ అయ్యూబ్(అ) చేసిన దుఆ

ఓ నా ప్రభూ! నాకు ఈ వ్యాధి తగిలింది. దానివల్ల నేను బాధపడుతున్నాను. నీవు కరుణామయుల్లోకెల్లా అందరికంటే ఎక్కువ కరుణజూపేవాడవు. (అల్ అంబియా 21: 83)

దైవప్రవక్త హ్జ్రత్ యాకూబ్(అ) చేసిన దుఆ

కనుక అల్లాహ్ మాత్రమే మహా రక్షకుడు. ఆయన కనికరించే వారందరిలోకెల్లా అమితంగా కరుణించేవాడు. (యూసుఫ్ : 64)

దైవప్రవక్త హ్జ్రత్ యూసుఫ్(అ) చేసిన దుఆలు (కృతజ్ఞతలు)

నిశ్చయంగా నా ప్రభువు తాను దేన్నయితే కోరుకుంటాడో దాని కోసం మహోత్తమమైన పన్నాగాన్ని పన్నుతాడు. మహత్తరమైన జ్ఞాన సంపన్నుడు, వివేకవంతుడూను (యూనుఫ్ : 100)

ఆకాశాలను, భూమిని సృష్టించిన ఓ ప్రభూ! నీవే ప్రపంచంలోను, పరలోకంలోను నాకు మిత్రుడవు, సంరక్షకుడవు. నేను ఇస్లామ్ ధర్మంలో ఉన్నటువంటి స్థితిలోనే నాకు మరణాన్ని ప్రసాదించు. చివరకు నన్ను సజ్జనులైన మానవులతో కలుపు. (యూసుఫ్: 101)

దైవప్రవక్త హ్జ్రత్ యూసుఫ్(అ) సోదరులు ఆయనకు చేసుకున్న వినతి :

నిశ్చయంగా అల్లాహ్ దానధర్మాలు చేసేవారికి శుభప్రదమైన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. (యూసుఫ్ : 88)

దైవప్రవక్త హ్జ్రత్ సులైమాన్(అ) చేసిన దుఆ

ఓ నా ప్రభూ! నీవు నాకు ప్రసాదించిన కానుకలకు నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు, నీవు సంతోషించే సత్కార్యాలను చేసేందుకు, నీ కారుణ్యంతో నన్ను సజ్జనులైన నీ దాసులలో కలుపు. (అన్నమ్ల్ : 19)

దైవప్రవక్త హ్జ్రత్ మూసా(అ) చేసిన దుఆ

ఓ నా ప్రభూ! నా హృదయాన్ని నా కోసం తెరిచి ఉంచు. నా పనుల్ని నా కోసం సులభతరం చెయ్యి. నా నాలుకలో ఉన్న ముడిని కూడా తెరువు. జనులు నేను చెప్పే మాటల్ని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి (తాహ్ : 25-28)

ఫిరౌన్ రాజు పిలిపించిన మాంత్రికులు ఇస్లామ్‌ను స్వీకరించిన తరువాత అల్లాహ్‌తో చేసిన దుఆ

ఓ మా ప్రభూ! మాకు అపారమైన సహనశీలతను ప్రసాదించు. మా ప్రాణాన్ని మేము ఇస్లామ్ ధర్మస్థితిలో ఉన్నప్పుడు తియ్యి. (అల్ ఆరాఫ్ 7: 126)

దైవప్రవక్త హ్జ్రత్ జకరియ్యా(అ) చేసిన దుఆలు

నిన్ను ప్రార్థించి నేను ఎన్నడూ రిక్తహస్తాలతో వెనక్కి మళ్ళలేదు. (మర్యమ్ : 4)

కనుక నీ ప్రత్యేక అనుగ్రహం ద్వారా నాకు ఒక వారసుణ్ణి ప్రసాదించు. (మర్యమ్ : 5)

జకరియాకు కూడా (తోడ్పడ్డాము). అతడు నాకు సైతం వారసుడు కావాలి. ప్రవక్త యాకూబ్(అ) వంశానికి కూడా అతడు వారసుడు కావాలి. ఓ నా ప్రభూ! అతన్ని అత్యంత ప్రియుడైన దాసుడుగా చేసుకో. (మర్యమ్ : 6)

నా ప్రభూ! నన్ను ఒంటరిగా వదిలిపెట్టకు. నువ్వే అందరికంటే శ్రేష్ఠమైన వారసుడవు. (అల్ అంబియా : 89)

గుహవాసులు చేసిన దుఆ

ఓ మా ప్రభూ! మాకు నీ వద్ద నుంచి ప్రత్యేక కారుణ్యాన్ని ప్రసాదించు. తద్వారా మా వ్యవహారాన్ని చక్కబెట్టు. (అల్ కహఫ్: 10)

అల్లాహ్ ఎవరికైతే సన్మార్గాన్ని చూపుతాడో వారే అసలైన సన్మార్గాన్ని పొందేవారు. అల్లాహ్ ఎవరినైతే మార్గం తప్పిస్తాడో వారికి మార్గాన్ని చూపించి రక్షించేవాణ్ణి నీవు పొందలేవు. (అల్ కహఫ్ : 17)



దుఆ చెయ్యమని దైవప్రవక్త(స) గారిని అల్లాహ్ ఆదేశించటం.

ఓ నా ప్రభూ! నా జ్ఞాన పరిధిని విస్తృతమైనదిగా చెయ్యి (తాహా : 114)

తల్లిదండ్రుల కోసం దుఆ చెయ్యమని అల్లాహ్ ఆదేశం

ఓ మా ప్రభూ! వారిపై కరుణజూపు. ఏవిధంగానైతే వారు నా మీద బాల్యంలో వాత్సల్యం చూపారో. (బనీ ఇస్రాయీల్ : 24)

విశ్వసించిన జనులు చేసే దుఆ

ఓ మా ప్రభూ! నీవు మాకు మా భార్యల ద్వారా, మా సంతానం ద్వారా కన్నుల చల్లదనాన్ని ప్రసాదించు. ఇంకా మమ్మల్ని భయభక్తులు కలవారికి నాయకులుగా చెయ్యి. (అల్ ఫుర్ఖాన్ : 74)

దైవప్రవక్త హ॥జత్ మూసా(అ) జాతి వారు చేసిన దుఆ

మేము అల్లాహ్‌నే నమ్ముకున్నాము. ఓ మా ప్రభూ! మమ్మల్ని ఆ దుర్మార్గుల కోసం పరీక్షగా చెయ్యకు. మరియు మమ్మల్ని, నీ కారుణ్యం ద్వారా వారి నుంచి విముక్తిని ప్రసాదించు. (యూనుస్: 85,86)

దైవప్రవక్త లూత్(అ) చేసిన దుఆ

ఓ నా ప్రభూ! కల్లోలాన్ని రేకెత్తించే ఈ దుర్మార్గపు జాతి నుంచి నన్ను కాపాడు. (అల్ అన్‌కబూత్ : 30)

మిమ్మల్ని ఎవరైతే ఎగతాళి చేస్తున్నారో వారిని శిక్షించటానికి మేము సరిపోతాము. (అల్ హిజ్ర్ : 95)

కనుక వారి బారి నుంచి మిమ్మల్ని ఆదుకునేందుకు అల్లాహ్‌యే చాలు. మీరు నిశ్చింతగా ఉండండి. ఆయన అన్నీ వింటాడు, ఆయనకు అన్నీ తెలుసు. (అల్ బఖర : 137)

శత్రువు మిత్రునిగా మారటానికి దుఆ

మీకు ఈనాడు ఎవరితోనైతే విరోధ విద్వేషాలు ఉన్నాయో వారికీ, మీకూ మధ్య ఎప్పుడో ఒకప్పుడు కరుణామయుడైన దేవుడు ప్రేమానురాగాలు కలిగించటం వింత విషయమేమీ కాదు. అల్లాహ్‌కు సర్వాధికారాలు ఉన్నాయి. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను. (అల్ ముమ్‌తహినహ్ : 7)

దైవప్రవక్త(స) గారికి ఈ దుఆ చెయ్యమని అల్లాహ్ ఆదేశం

ఓ నా ప్రభూ! నీవు నన్ను ఎక్కడకు తీసుకుపోయినా మంచి స్థితిలో తీసుకుపో. నీవు నన్ను ఎక్కడ నుంచి తీసినా మంచి స్థితిలో తియ్యి. నా కోసం నీ దగ్గర నుంచి ప్రాబల్యాన్ని, అధికారాన్ని పంపించు. సత్యం వచ్చేసిందని, అసత్యం పతనమైపోయిందని ప్రకటించు. నిశ్చయంగా అసత్యం వినాశనానికి గురి అయ్యేదే. (బనీ ఇస్రాయీల్ : 80,81)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.


GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

తెలుగు పాఠకుల సేవలో

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సమర్పిస్తున్న మరో అపురూప కానుక

# ఆదర్శమూర్తి ముహమ్మద్

(సల్లల్లాహు అలైహి వ సల్లమ్)




గీటురాయిలో
ధారావాహికంగా
'సచ్చరిత పత్రాలు' శీర్షికన
82 ఎపిసోడ్లలో వచ్చిన
పరిశోధనాత్మక సీరత్ పుస్తకం

రచన: ఎస్.ఎమ్. మలిక్

కాపీల కొరకు సంప్రదించండి:
**9700255736, 9490627650**

1/8 డెమీ పేజీలు: 532 వెల: రూ.400/-

**Bank Details:**
**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST**
Central Bank of India, Noorkhan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407

**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST** (Regd.)
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500002




**ఇస్లాం** మతం పుట్టిపెరిగిన అరేబియాతో భారతదేశానికి అతి ప్రాచీన కాలంలోనే సంబంధం ఏర్పడింది. ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం నుంచే అరేబియా ప్రజలతో భారతదేశానికి వాణిజ్య, ధార్మిక సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయన్నది చరిత్రకారులు పురావేత్తల నమ్మకం. భారత వాణిజ్య వ్యాపారాలతోపాటు భారతీయ భావాలు, దేవతా మూర్తులు భారత- అరేబియా వ్యాపారస్తుల ద్వారా అరేబియాలోని వివిధ ప్రాంతాలకు చేరాయి. అంతేకాక, ఆయా స్థానికుల ఆమోదాన్ని సయితం పొందుతూ వచ్చాయి.

క్రీ.శ. 6వ శతాబ్దంలో అరేబియాలో ఇస్లామీయ విప్లవం వచ్చింది. అనతి కాలంలోనే అది ఒక సామాజిక, రాజకీయ శక్తిగా భారత ఉపఖండం మీదికి అడుగుపెట్టింది. తొలుత వాయవ్య తీర ప్రాంతానికి, దక్షిణ ప్రాంతానికి సముద్ర మార్గం ద్వారానూ, ఈశాన్య ప్రాంతానికి రహదారి మార్గం ద్వారానూ వచ్చింది. సముద్ర మార్గం ద్వారా వచ్చిన వాళ్ళల్లో ఎక్కువ మంది వ్యాపారస్తులు కాగా రహదారి మార్గం ద్వారా వచ్చిన వాళ్ళు ప్రధానంగా విజేతలు. సూఫీ తత్వవేత్తలు, ధర్మ ప్రచారకులు ఉభయ మార్గాల నుంచీ వచ్చారు.

భారతదేశంలో ఇస్లాం మతవ్యాప్తి సూఫీ తత్వవేత్తలు, ధర్మ ప్రచారకుల ద్వారా జరిగిందా, విజేతల ద్వారా జరిగిందా అనే విషయంలో తీవ్ర అభిప్రాయ భేదాలున్నప్పటికీ ఇస్లాం మతం మొట్టమొదట దక్షిణ భారతంలోకి అడుగు పెట్టిందనే విషయంలో అత్యధికులకు ఏకాభిప్రాయం ఉంది.

ఇస్లామిక్ విప్లవానికి పూర్వం నుంచే అరబ్బులు తమ వాణిజ్య అవసరాల నిమిత్తం కేరళ తీర ప్రాంతాలలో స్థిర నివాసాలు ఏర్పరచుకోవడం ప్రారంభించారు. అరబ్బులతో వ్యాపారం లాభసాటిగా ఉండటం, ఈ వాణిజ్యం వల్ల ఆ ప్రాంతం అభివృద్ధిని సాధించడం వంటి కారణాల వల్ల వారికి స్థానిక పాలకులు అండదండలందించసాగారు. అరబ్బు చరిత్రకారులు వివిధ సందర్భాల్లో బలమారును మాబర్ అని పేర్కొన్నారు.

ఇస్లామ్ ధర్మం ఆవిర్భవించిన అనంతరం ముస్లిములుగా మారిన అరబ్బు వ్యాపారులు వ్యాపారంతోపాటు ధర్మ ప్రచారాన్ని కూడా తీసుకురావటం ప్రారంభించారు. కేరళ తీరం ద్వారా భారత భూభాగం మీద అడుగు పెట్టిన మొట్టమొదటి ఇస్లామ్ ధర్మ ప్రచారకుడు ప్రవక్త(స) సహచరుల్లో ఒకరైన హ్రజత్ ఉస్మాన్ బిన్ ఆస్(రజి). ఇటువంటి పలువురు మహనీయుల కారణంగానే ఇస్లాం మతం తీర ప్రాంతాల మీదుగా శ్రీలంక, మాల్దీవులు, లక్షదీవుల్లోకి సయితం అనతికాలంలోనే వ్యాపించగలిగింది.

ప్రవక్త హ్రజత్ ముహమ్మద్(స) జీవితంలో జరిగిన ఒక అద్భుత

సంఘటనను కళ్ళారా చూసిన ప్రత్యక్ష సాక్షి కూడా మలబార్‌లో ఉన్నట్టు అనేక సాక్ష్యాధారాలున్నాయి. ప్రవక్త(స) అల్లాహ్ ఏకత్వాన్ని గురించి బోధిస్తున్న కాలంలో ఆయనను అల్లాహ్ ప్రవక్త(స)గా విశ్వసించడానికి అరబ్బు వాసులు ఏదైనా ఒక నిదర్శనం చూపించమని అడుగుతారు. అప్పుడు ప్రవక్త(స) తన చూపుడు వేలుని చంద్రునికేసి చూపిస్తారు. చంద్రుడు నిలువుగా చీలిపోతాడు. ఈ నిదర్శనాన్ని తనివితీరా చూసిన అనేకులు ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తారు. అరబ్బుల ద్వారా ఈ వృత్తాంతం మలబారు చేరుకుంటుంది. ఈ అద్భుత దృశ్యాన్ని చూసి వున్న మలబారు పాలకుడు జమూరిన్ సామరిన్ తన రాజ్యంలోని అనేకమంది ప్రజానీకంతో సహా ఇస్లాం మతాన్ని స్వీకరించాడు.

హిజరీ శకం ఒకటో శతాబ్దం అనగా క్రీ.శ. ఆరో శతాబ్దం నాటికే ఇస్లాం మతం దక్షిణభారతంలో వేళ్ళూనుకుందని చెప్పటానికి ఇంకా అనేక దృష్టాంతాలున్నాయి.

భారత ఉపఖండం మొట్టమొదటి మసీదు నిర్మాణానికి కేరళలోని కొడుంగల్లూరులోనే పునాది రాళ్ళు పడ్డాయి. ఈ చారిత్రక వాస్త వాన్ని లోకానికి చాటి చెప్పేందుకుగాను నిత్య నమాజుల నెలవుగా ఈ మసీదు ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలబడి ఉన్నది. తొలి భారత ముస్లింల నమాజులందుకున్న ఈ పవిత్ర ప్రార్థనా మందిరం పురాతత్వవేత్తలకు, చరిత్రకారులకూ ఒక గొప్ప పరిశోధనాంశం. కాలికట్ నగరంలో ప్రవక్త(స) సహచరుల్లో ఒకరైన హజ్రత్ మాలిక్ బిన్ దీనార్(ర) పవిత్ర సమాధి నెలకొని ఉంది. అలాగే తమిళనాడు రాష్ట్రంలోని కొళ్ళం నగరంలో మదీనా వాస్తవ్యులు, ప్రవక్త(స) సహచరుల్లో ఒకరూ అయిన హజ్రత్ తమీమ్ అన్సారీ(ర) పవిత్ర సమాధి వుంది.

ఈ సందర్భంగా మనం ముస్లిం చరిత్రకారుడు ఇబ్నె బతూతా యాత్రానుభవాల్లో మలబార్ గురించిన ప్రస్తావనల్ని పరిశీలిం చడం ఎంతైనా సమంజసంగా ఉంటుంది.

(అ) బద్‌పటన్ (కాలికట్ సమీపంలోని బేపూర్) పట్టణం నుంచి బయలుదేరి మేం ఖందరీనా కాలికట్‌కి ఉత్తరాన 16 మైళ్ళ దూరంలో ఉన్న 'పందరానీ' చేరుకున్నాం. ఇది చాలా పెద్ద పట్టణం. వీధులు, ఉద్యాన వనాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ముస్లింల వీధులు మూడున్నాయి. వీధికొక మసీదు వుంది. జామియా మసీదు సముద్ర తీరాన వుంది. (అజాయబుల్ అస్ఫార్- పుట-291)

(ఆ) అక్కడినుంచి బయలుదేరి మేం కాలికట్ వెళ్ళాం. ఇది మలబార్‌లోకెల్లా అతిపెద్ద నౌకాశ్రయం. ఇక్కడి రాజును సామరీ అని పిలుస్తారు. ధనికుడైన వ్యాపారి పేరు ఇబ్రాహీమ్. ఇతడు బహరైన్ నివాసి. ఈ పట్టణ ఖాజీ ఫఖ్రుద్దీన్ ఉస్మానీ కూడా గొప్ప దానశీలి. ఆశ్రమం షేఖ్ పేరు షహాబుద్దీన్ గాజర్దానీ. (అదే పుస్తకం : పుట- 292)

(ఇ) అయిదో రోజుకి మేము కంజీగరి చేరుకున్నాం. .... ఆ పట్నంలో ముస్లిం వ్యాపారస్తులు అనేకమంది ఉన్నారు. వాళ్ళందరిలోకెల్లా పెద్దవాడైన అల్లావుద్దీన్ అధి ఆదా నివాసి. ఈ పట్నంలో ఒక ఫాజిల్ ఖాజీగా ఉన్నాడు. ముస్లిం పెద్ద పేరు ముహమ్మద్ షా బందర్. ఇతని సోదరుడు తఖీయుద్దీన్ గొప్ప ఫాజిల్. ఈ పట్టణం లోని జామియా మసీదు కూడా అద్భుతంగా వుంది. దీనిని ఖాజా మందబ్ నిర్మించాడు. ముస్లింలకు ఈ పట్టణంలో ఎంతో మంచి గౌరవం ఉంది. రాజు పేరు తబర్దీ. ముస్లింలను ఎంతో గౌరవించేవాడు. (అదే పుస్తకం పుట- 298)

(ఈ) రెండో రోజు తెల్లవారేసరికి హెూనూరు చేరుకున్నాం. ఈ పట్టణం ఒక పెద్ద అఖాతం మీద ఉంది. ఈ పట్టణ దైవోపాసకు లలో షేక్ ముహమ్మద్ నాగూరీ ఉన్నాడు. ఆయన తన ఆశ్రమంలో నాకు ఆతిథ్యం ఇచ్చాడు. ఖుర్‌ఆన్ పాఠాలు చెప్పే ధర్మశాస్త్రజ్ఞుడు ఇస్మాయీల్ ఈ పట్టణంలో ఉంటారు. ఆయన ఎంతో నిష్ఠాగరిష్టుడు, మృదుస్వభావి, ఉదారుడు. ఈ పట్టణ ఖాజీ పేరు నూరుద్దీన్ అలీ... ఇక్కడి స్త్రీలు అపురూప సౌందర్య వతులు, సుశీలలు. అందరూ ఖుర్‌ఆన్‌ను కంఠస్తం చేసినవారే. ఇక్కడ ఆడపిల్లల పాఠశాలలు పదమూడు ఉండగా, మగపిల్లల పాఠశాలలు ఇరవై మూడుఉన్నాయి. ఇక్కడి చక్రవర్తి పేరు జమాలుద్దీన్. ఇతనికి మలబార్ వాసులు కొంత కప్పం చెల్లించే వారు. చక్రవర్తి జమాలుద్దీన్ ముహమ్మద్ బిన్ హసన్ ఎంతో మంచి వ్యక్తి. ఎల్లప్పుడూ సామూహికంగానే నమాజు ఆచరించే వాడు. నేను అతని అతిథిగా ఉన్నప్పుడు ఇఫ్తార్ సమయానికి నన్ను పిలిపించుకునేవాడు. ధర్మశాస్త్రజ్ఞులైన అలీ (తఫ్‌సీరె రహ్మానీ రచయిత ముల్లా అలీ ముహయమీ), ఇస్మాయీల్‌లు కూడా అక్కడే ఉండేవారు. (అదే పుస్తకం - పుట 279)

ఈ అంశాలన్నింటితోపాటు ఒక నూతన ధర్మం నిలదొక్కుకోవ డానికి అనువైన భౌతిక పరిస్థితులు, వాతావరణం కూడా దక్షిణ భారత ప్రాంతంలోనే ఆనాడు ఎక్కువగా ఉన్నాయి.

క్రీ.శ ఆరో శతాబ్దం నాటికి దక్షిణ భారతదేశంలో వర్ణ వ్యవస్థ వికృత వికటాట్టహాసం చేస్తున్నది. సమాజాన్ని రక్తసిక్తం చేసిన వైదిక శత్రువుల్ని, పూజారి వ్యవస్థని, దారుణమైన వర్ణ వ్యత్యాసాల్ని, జాత్యాహంకారాన్నీ తోసిరాజని బలమైన ప్రజా పునాదులతో

ముందుకు వచ్చిన బౌద్ధ, జైన మతాల్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసిన వైదిక, శైవ- వైష్ణవ మతాలు తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. దేవునికీ, భక్తునికీ మధ్య దూరం ఎక్కువయింది. పాలకుల భాషగా స్థిరపడిన సంస్కృత భాషకీ పాలితులయిన సాధారణ ప్రజానీకానికి మధ్య సంవాదానికి స్థానమనేది లేకుండా పోయింది. నైతిక విలువలకు నిలువ నీడ లేకుండా పోయింది. అగ్రకులాల అత్యాచారాలకు అడ్డు అదుపు లేని స్థితి. అణిచివేతకు వ్యతిరేకంగా వివిధ సందర్భాల్లో పీడిత కులాల నుంచి సామూహిక స్థాయిలో నిరసన వెల్లువెత్తేది. అంతేస్థాయిలో బ్రాహ్మణీయ అగ్రకుల సామాజిక వ్యవస్థ దానిని నిర్దాక్షిణ్యంగా అణిచివేసేది. వివిధ సమయాల్లో వివిధ సందర్భాల్లో, వివిధ స్థాయిల్లో సామాజికంగా, ధార్మికంగా ముందుకు వచ్చిన నిరసనలు, తిరుగుబాట్లు పశు బలం కారణంగా తాత్కాలికంగా అణచివేతకు గురైనప్పటికీ అంతర్గతంగా అవి సమీకృతమవుతూ వచ్చాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే, ఇస్లాం ఆవిర్భావానికి ముందు అరబ్బు సమాజం ఎంత అనాగరికంగా, దుర్మార్గంగా ఉందో దక్షిణ భారత సమాజం కూడా దాదాపు అదే పరిస్థితిలో ఉంది. మరో తథాగతుని రాక కోసం ఎదురు తెన్నులు చూడటం తప్ప పీడిత ప్రజానీకం ఏమీ చేయలేని స్థితి.

క్రీ.శ. ఆరో శతాబ్దంలో పుట్టిన ఆచార్య నాగార్జునుడు తన శూన్యవాద సిద్ధాంత ప్రతిపాదన ద్వారా బౌద్ధంలోని చిట్టచివరి అనుకూలాంశాలకు కూడా చరమగీతం పాడాడు.

ఖచ్చితంగా యిదే సమయంలో, హిజ్రీ శకం మొదటి శతాబ్దంలోని ద్వితీయార్థంలోనే క్రీ.శ. 500-600 మధ్య కాలం ఇస్లాం మతం ఉజ్వల కాంతులు అద్వైత తత్వదర్శనానికి ఆకృతినిచ్చిన ఆదిశంకరాచార్యులు అధివశించిన స్థలంలోనే వెల్లివిరిశాయి. దక్షిణ భారతంలో, మరీ ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో మొట్టమొదటగా బౌద్ధులు, అంత్యజులు, మ్లేచ్ఛుల స్థానంలో అమానుషత్వాన్ని చవిచూస్తున్న కింది కులాల వాళ్ళు ఇస్లాం మతాన్ని స్వీకరించారు.

అరబ్బులతో వర్తక సంబంధాలున్న కుటుంబాలు ఇస్లాం మతాన్ని స్వీకరించాయి. లబ్బా, మరక్కయారు, నాయత్, మోప్లాలనే గిరిజన తెగలు అరబ్బు తెగలతో ఇస్లాంకు పూర్వమే వైవాహిక సంబంధాలను ఏర్పరచుకున్నాయి. ఇస్లాం ఆవిర్భావం ఈ ఐక్యతను మరింత సుదృఢం చేసింది. అరబ్బులతో రక్త సంబంధం ఏర్పడిన కొన్ని తరాల అంతరం తరువాత ఇస్లాం మతాన్ని స్వీకరించిన ద్రావిడులే ఈనాటి లబ్బా ముస్లిం సమూహాలు. తమిళనాడు దక్షిణ ఆర్కాటులోని తిరునల్వేలి, కాయల పట్నం, తంజావూరు ప్రాంతాల్లో నివసించే లబ్బాల వైవాహిక ఆచారాలకీ, అక్కడి కింది కులాల వారి ఆచారాలకీ మధ్య ఇప్పటికీ కొన్ని పోలికలు కనిపిస్తాయి. ఒక్క ఖుర్ఆన్ పఠనం తప్ప దాదాపుగా మిగతా తతంగాలన్నీ ఉభయులకీ ఒకటే.

తమిళ భాష మాట్లాడే మరక్కయారు ముస్లింలు కూడా లబ్బాల వంటి ఒక తెగకు సంబంధించినవారే. మరక్కయార్లు కూడా మౌలికంగా వ్యాపారస్తులే. మరక్కయారు అంటే నావికుడు. వాణిజ్య నౌకలు నడిపేవారు గనక వారిని మరక్కయార్లు అనేవారు. ఈ విధంగా ఇస్లాం పూర్వమే అరబ్బు వర్తకులతో వీరికి సంబంధాలు ఏర్పడటంతోపాటు అనతి కాలంలోనే ఇరు ప్రాంతాల తెగల మధ్య వివాహ సంబంధాలు కూడా ఏర్పడ్డాయి.

లబ్బా ముస్లింలకీ, మరక్కయారు ముస్లింలకీ తేడా- లబ్బాలు ఇమామె హనఫీ అనుయాయులు కాగా, మరక్కయార్లు ఇమామె షాఫియీ అనుయాయులు.

ధార్మిక ఆచరణ వంటి విషయాలలో మలబారు మోప్లాలు చాలా నిష్ఠాగరిష్ఠులు. వాయవ్య సముద్ర తీర ప్రాంతాన అరబ్బు- ద్రవిడ తెగల సంపర్కంతో ఉద్భవించిన మిశ్రమ జాతి ఇది. మలబారు


# ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

లోని బానిస తెగలు ఇస్లాం ద్వారా విముక్తిని సాధించడంతో వీరి జనాభా గణనీయంగా పెరిగింది. మోప్లాల్లో అధిక శాతం ఇమామె షాఫియీ అనుయాయులు.

ఇదిలా ఉండగా, హిజ్రీ శకం 15వ సంవత్సరంలో రెండవ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ ఫారూఖ్(రజి) హయాంలో హజ్రత్ హకీం బిన్ అబీ ఆస్(ర) నాయకత్వాన బొంబాయి సమీపంలోని ఒక ప్రాంతం మీద ముస్లింలు దాడి చేశారు. ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్(ర) హయాంలో కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయి. హిజ్రీ శకం 93వ సంవత్సరం అనగా క్రీ.శ. 713లో ఇరాఖ్ రాజు హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఆదేశం మేరకు అతని అల్లుడూ, మేనల్లుడూ అయిన ముహమ్మద్ బిన్ బిన్ ఖాసిం సింధు ప్రాంతం మీద దండెత్తి విజయం సాధించాడు.

ముస్లిం రాజులు, చక్రవర్తుల వల్ల భారతదేశంలో ఇస్లాం మత వ్యాప్తికి పూర్తి అనుకూల వాతావరణం ఏర్పడిందని చాలా మంది చరిత్రకారులు రాశారు. కాని ఇది ఎంతమాత్రం వాస్తవం కాదు. పక్షపాత వైఖరి, వాస్తవాల్ని అతిగా సులభీకరించడం వంటి కారణాల వల్ల చరిత్రకారులు ఇటువంటి నిర్ధారణలకు వచ్చారు. ముస్లిం పాలకుల రాకతో పాలక వర్గానికి సంబంధించిన ఒక అభిజాత్య వర్గం ఏర్పడింది. ముస్లిం సమాజంలోని ఆర్థిక సమూహాలు సామాజిక సమూహాలుగా, చివరికి కుల సమూహాలుగా కనిపించే ప్రమాదం కూడా ఏర్పడింది.

వీటికి భిన్నంగా అరబ్బుల సంపర్కంతో భారతదేశంలో వర్ణ వ్యవస్థ నుంచి వెలివేయబడిన వాళ్ళు, బౌద్ధం వల్ల ప్రభావితులై వివిధ సందర్భాల్లో బ్రాహ్మణాధిపత్యాన్ని, పురోహిత వ్యవస్థని సవాలు చేయడానికి ప్రయత్నించిన క్షత్రియ తదితర కులాల వాళ్ళు ఇస్లాంను స్వీకరించి అరేబియా, ఇరాఖ్ దేశాలకు వెళ్ళి సూఫీ తత్వాన్ని భారతదేశానికి తీసుకువచ్చారు. ఉత్తర భారత దేశంలో ఇస్లాం వ్యాప్తికి దోహదపడిన సూఫీల్లో హజ్రత్ ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మతుల్లా అలైహ్), హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా (ర), హజ్రత్ ఖుతుబుద్దీన్ బఖ్తియార్ కాకీ (ర), హజ్రత్ షర్ఫుద్దీన్ యహ్యా మునేరీ(ర), హజ్రత్ బూ అలీషా ఖలందరీ పానిపత్తి(ర), హజ్రత్ బాబా గంజ్ షక్కర్(ర), హజ్రత్ దాతాగంజ్ బఖ్ష్(ర), హజ్రత్ సయ్యద్ అలీ హుజ్వేరీ(ర), హజ్రత్ ముజద్దిద్ అల్ఫ సానీ(ర), హజ్రత్ షాహ్ వలియుల్లా (ర), హజ్రత్ సయ్యద్ అలీ హమ్దానీ (ర), హజ్రత్ సయ్యద్ అహ్మద్ షహీద్(ర), హజ్రత్ షాహ్ ఇస్మాయీల్ షహీద్(ర)లు ముఖ్యులు.

అలాగే, దక్షిణ భారతంలో మరీ ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో ఇస్లాం మతవ్యాప్తికి దోహదం చేసినవారిలో హజ్రత్ హాజీ రూమీ, హజ్రత్ సయ్యద్ షా మోమిన్ ఆరిఫిల్ల, బాబా మజహర్ తబత ఆలిమ్, షాహ్ జలాలుద్దీన్ గంజ్‌రవా, సయ్యద్ అహ్మద్ కబీర్ జహా ఖందర్, షాహ్ అలీ పహిల్వాన్, షాహ్ హుసాముద్దీన్, సూఫీ సర్‌మస్త్, బాబా షర్ఫుద్దీన్, బాబా షహాబుద్దీన్, బాబా ఫఖ్రుద్దీన్, సయ్యద్ అయిజుద్దీన్ హుసేనీ వంటి సూఫీలు ముఖ్యులు.

ఈ సందర్భంగా మనం ఇస్లాం రాకతో ముడిపడి ఉన్న మరో చారిత్రక వాస్తవాన్ని కూడా గుర్తించడం అవసరం. ఇస్లాం అరేబియా నుంచి సముద్ర మార్గం ద్వారా నేరుగా దక్షిణ ప్రాంతానికి రావటం వల్ల ఈ ప్రాంతంలో తన స్వచ్ఛతని చాలా కాలం నిలుపుకోగలిగింది. ధర్మ ప్రచారం కోసం సూఫీలు స్థానిక ధార్మిక నుడికారాన్నీ, మాధ్యమాల్నీ విరివిగా ఉపయోగించుకున్నప్పటికీ ఇస్లాం మౌలిక స్వరూపానికి, స్వచ్ఛతకీ ఎక్కడా భంగం కలగనీయలేదు. ఉత్తరాదిన ఇస్లాం రహదారి మార్గం ద్వారా ఈరాన్, అఫ్గనిస్తాన్‌ల మీదుగా భారత భూభాగం మీదికి అడుగుపెట్టింది. దీంతో ఈరాన్, అఫ్గనిస్తాన్‌లలో నెలకొని ఉన్న కొన్ని జాడ్యాల్ని కూడా ఇస్లాం తనలో ఇముడ్చుకుని వెంట తెచ్చుకుంది. ముస్లిం విజేతలతో ఆ జాడ్యాలు దక్షిణాదిన కూడా దిగుమతి అయ్యాయి. ఆ మేరకు దక్షిణాదిన ఇస్లాం స్వచ్ఛతని ఎంతో కొంత కలుషితం చేశాయి.

ముస్లిం విజేతలు ఇస్లాం మత వ్యాప్తికి పరోక్షంగానే తప్ప ప్రత్యక్షంగా తోడ్పడిన సందర్భాలు చాలా తక్కువ.

ముస్లిం విజేతలు ఇక్కడి ప్రజల ధార్మిక విశ్వాసాల్లో పెద్దఎత్తున మార్పు రావటానికి పరోక్షంగా సాయపడ్డారు. దేవాలయాల్నీ, దేవతా విగ్రహాల్ని విధ్వంసం చేసి కూడా అంతకు పూర్వం రాజుల కన్నా ఎక్కువ దర్పంతో ముస్లిం రాజులు పరిపాలించటం పీడిత ప్రజల్ని ఆశ్చర్యచకితం చేసింది. దైవం సర్వశక్తివంతుడు, రాజు దైవాంశ సంభూతుడు అనేది వాస్తవం కాదనే అభిప్రాయం క్రమేణా బలపడసాగింది. సామాజిక సమానత్వాన్ని ప్రతిపాదించే ఇస్లాం మతంలోకి పెద్దఎత్తున ప్రవేశిస్తూ వచ్చారు.

కొందరు సూఫీలు రాజాశ్రయం పొందినప్పటికీ సూఫీల్లో అధిక సంఖ్యాకులు రాజులు, చక్రవర్తుల ప్రయోజనాలను కాపాడటం తమ విద్యుక్త ధర్మం ఎంతమాత్రం కాదని బలంగా విశ్వసించడమే గాక ఆచరణలో రుజువు చేశారు.

**(గీటురాయి 5-1-2001 'ఆంధ్రప్రదేశ్ ముస్లిములు' ప్రత్యేక సంచిక నుంచి...)**

# ఇస్లామ్ : ఓ సంపూర్ణ జీవన సంవిధానం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**అజ్ఞానం,** అంధకారంలో మునిగి ఉన్న ఆ సమాజం జ్ఞాన కాంతులతో ప్రకాశించింది.

ఆడకూతుళ్ళను నామోషిగా భావించి సజీవ సమాధి చేసిన తల్లిదండ్రులే ఆమె పుట్టుకను శుభవార్తగా, స్వర్గానికి సోపానంగా, నరకాగ్ని నుండి కాపాడే రక్షక కవచంగా భావించి తలెత్తుకు తిరిగారు.

కుమారులతోపాటు కుమార్తెలకు సయితం ఆస్తి హక్కు ఇవ్వడం తమ విధిగా గుర్తించారు.

శతాబ్దాల పాటు మద్యం మత్తులో జోగిన ఆ జాతి ఇక ప్రళయం వరకు ఒక్క చుక్క మద్యం కూడా ముట్టేది లేదని శపథం చేసింది.

తమ స్థాయి, ఆత్మగౌరవాన్ని మరచిపోయి అగుపించిన ప్రతి వస్తువును దైవంగా తలంచి పూజించినవారు, నిజ సృష్టికర్త ఒక్కడేనని, సకల ఆరాధనలకు, సమస్త స్తోత్రాలకు, ఉపాసనా రీతులకు ఆయన ఒక్కడే అర్హుడని అర్థం చేసుకున్నారు.

ఊడిగం, వెట్టిచాకిరి చెయ్యడానికే వీరు పుట్టారు అనుకునే తమ బానిసలను నాయకులుగా, అధినాయకులుగా నియమించు కోవడానికి సిద్ధమయ్యారు ఆ జాతి పెద్దలు. వారిలో వచ్చిన ఈ మార్పుకి, వారి ఈ సత్ప్రవర్తనకు, పరివర్తనకు కారణం ఒక్కటే- అదే ఇస్లామ్! ఇస్లామ్ మనిషి ఇహపరాల సౌభాగ్యానికి, సిసలయిన సంతోషానికి, అసలయిన సంతృప్తికి పూచీ వహిస్తుంది. అదెలా అంటే?

సృష్టికర్త అయిన అల్లాహ్ యెడల దాసుడు విశ్వాసం కలిగి ఉండటం ద్వారా దీన్ని సాధించుకోగలడు అంటుంది ఇస్లామ్. దాసునికి, దేవునికి మధ్య గల ఈ అనుబంధం వల్లనే మనిషికి అసలయిన సంతోషం, సిసలయిన సంతృప్తి సాధ్యమవుతుంది. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "విశ్వసించిన వారి సంరక్షకునిగా స్వయంగా అల్లాహ్ ఉంటాడు. ఆయన వారిని చీకట్ల నుండి వెలుగు వైపునకు తీసుకుపోతాడు. కాగా అవిశ్వాసుల నేస్తాలు షైతానులే. వాళ్ళు వారిని వెలుగు నుండి చీకట్ల వైపు లాక్కుపోతారు. వారు నరక వాసులు, కలకాలం అందులోనే పడి ఉంటారు". (బఖరహ్: 257)

ఈ మేరకు మానవతా ధర్మమయిన ఇస్లామ్ మానవాళికి ఇచ్చే రక్షణ గురించి, శిక్షణ గురించి తెలుసుకుందాం!

## ధర్మ పరిరక్షణ

మనిషి పుట్టుకతోనే స్వేచ్ఛాజీవి. తనకు సంబంధించిన ప్రతి విషయంలోనూ పూర్తి స్వేచ్ఛ కలిగి జీవించాలని కోరుకుంటాడు. అదే స్వేచ్ఛ తాను అవలంబించే మతధర్మం విషయంలో సయితం తనకు దక్కాలని అభిలషిస్తాడు. అతని ఈ సహజ భావనకనుగుణంగానే సర్వలోక సృష్టికర్త అతన్ని పుట్టించి, వినే, అనే, కనే శక్తిని అనుగ్రహించి, సత్యాసత్యాల వ్యత్యాసాన్ని విడమరచి చెప్పడంతోపాటే, బాటను అనుసరించే, మాటను అనుసరించే స్వేచ్ఛను మాత్రం అతనికి ప్రసాదించాడు. ఇలా అన్నాడు: (ఆసాంతం సత్యంతో కూడుకున్న ఈ ఖుర్ఆన్) మీ ప్రభువు తరపు నుంచి వచ్చిందని ప్రకటించు. ఇక కోరిన వారు దీన్ని విశ్వసించవచ్చు మరియు కోరిన వారు నిరాకరించవచ్చు".
(దివ్య ఖుర్ఆన్-18:29)

ధర్మం ఎంతటి మహత్తు గలదంటే, అల్లాహ్ మానవులను దాని కోసమే పుట్టించాడు. దాన్ని సమస్త మానవాళికి చేరవేయడానికి, దాన్ని సంరక్షించడానికి ప్రవక్తల్ని ప్రభవింపజేశాడు. గ్రంథాల్ని అవతరింపజేశాడు. ఇలా సెలవిచ్చాడు: 'మేము ప్రతి సముదాయంలోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా (ప్రజలారా!) అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప ఇతరత్రా మిథ్యా దైవాలకు దూరంగా ఉండండి" అని బోధ పర్చాము'. (అన్ నహ్ల్: 36)

మతధర్మాన్ని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛ మనిషికి ఉన్నప్పటికీ అతను సత్యధర్మాన్నే అనుసరించినట్లయితే దానికి బదులు స్వర్గసీమను ప్రసాదిస్తానని శుభవార్తను అందజేయడంతోపాటు, ఒకవేళ ఆ స్వేచ్ఛను దుర్వినియోగ పరచి మిథ్యావాదాలను, అసత్యాలను, అర్ధ సత్యాలను నమ్మి బతికినట్లయితే నరక యాతనలు తప్పవు అని హెచ్చరించాడు కూడా. అయితే మత స్వేచ్ఛ మాత్రం అతని శ్వాస ఆగేంత వరకు అతనికుంటుంది. ఆ విషయంలో ఎలాంటి బలవంతం, బలాత్కారం లేదు అన్నాడు అల్లాహ్: "ధర్మం విషయంలో బలవంతం ఏమీ లేదు. సన్మార్గం అపమార్గం నుండి ప్రస్ఫుటమయింది". (బఖరహ్: 256)

## మేధో రక్షణ

మనిషి మస్తిష్కాన్ని పాడు చేసే ప్రతి విధమయినటువంటి

విషయాన్నుండి ఇస్లామ్ వారిస్తుంది. ఎందుకంటే, మనిషికి ప్రాప్తమయి ఉన్న ఇతర భౌతికానుగ్రహాలు ఓ ఎత్తయితే విచక్షణా జ్ఞానం, తెలివితేటలు ఓ ఎత్తు. అతనికి ప్రాప్తమయి ఉన్న ఈ మేధోశక్తి ఆధారంగానే ఇతర సృష్టితాలలో అతనికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అట్టి మేధోశక్తికి నీరుగార్చే మత్తు పానీయాలను, మాదక ద్రవ్యాలను, వెకిలి చేష్టలను ఇస్లామ్ సంపూర్ణంగా నిషేధిస్తుంది: "ఓ విశ్వసించిన ప్రజలారా! నిశ్చయంగా సారాయి, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ పరమ జుగుప్సాకరమయిన విషయాలు, షైతాన్ చేష్టలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు"

(మాయిదహ్: 90)

## ప్రాణ రక్షణ

అల్లాహ్, ఏ ప్రాణినయినా లేదా స్వయాన్నయినా సరే హాని కలిగించడాన్ని, హత్య చేయడాన్ని నిషేధించాడు. ఇలా అన్నాడు: "చేజేతులా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి".

(అల్ బఖరహ్: 195)

వ్యక్తులు ఎవరయినా, ఏ మత ధర్మానికి చెందినవారయినా సరే అన్యాయంగా ఒకరిపై దౌర్జన్యానికి ఒడిగట్టే వారి ఆట కట్టించే నిమిత్తం హద్దులను, శిక్షలను నిర్ణయించారు. ఇలా అన్నాడు: "ఓ విశ్వసించిన ప్రజలారా! హతుల విషయంలో ప్రతీకార న్యాయం (ఖిసాస్) మీ కొరకు విధిగా నిర్ణయించబడింది".

(అల్ బఖరహ్: 178)

"ఓ బుద్ధి జీవుల్లారా! ఈ ప్రతీకార న్యాయంలోనే మీ జీవనం ఉంది- ఇలా ఉంటేనే మీరు (అమానుషాల నుండి) ఆగి ఉంటారు". (అల్ బఖరహ్: 179)

ఒక్క మాటలో చెప్పాలంటే ఇస్లామ్ మనిషి ప్రాణానికి ఇచ్చినంత విలువ మరే మతధర్మం ఇవ్వలేదు: "ఎవరయితే అన్యాయంగా ఒక మనిషిని చంపాడో అతను సకల మానవులను చంపినట్లే. మరెవరయితే ఒక ప్రాణాన్ని కాపాడాడో అతను సకల మానవుల ప్రాణాలను కాపాడినట్లే". (మాయిదహ్:32)

## సంతాన సంరక్షణ

సంతాన రక్షణ కోసం ఇస్లామ్ గట్టి చర్యలే చేపట్టింది. ఏ కుటుంబంలో పిల్లలు పెరిగి పెద్దవుతారో ఆ కుటుంబ పునాదిని ఇస్లామ్ పవిత్ర బంధం పునాదిగా నిర్మించగోరుతుంది. వారి హక్కుల్ని పెద్దలకు బోధించడమే కాకుండా వారి మధ్య న్యాయంగా వ్యవహరించ మని హితవు పలుకుతుంది. ఇస్లాం ధర్మసమ్మతమయిన రీతిలో వివాహం చేసుకోవాలని అభిలషిస్తుంది. అందులో వెకిలి చేష్టలకు, దుబారా ఖర్చుకు పాల్పడకూడదంటుంది. ఇస్లామ్ అక్రమ సంబంధాలపై, అధర్మ వావివరసలపై, అశ్లీలం, అనైతికాలపై తన శిక్షా కొరడాను ఝుళిపిస్తుంది.

## మాన రక్షణ

ఇస్లామ్ మనిషి మాన మర్యాదలకు పెద్ద పీట వేస్తుంది. ప్రజల పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా, వారి వంశాన్ని తూల నాడే చర్యలకు పాల్పడకుండా ఉండాలని నొక్కి వక్కాణిస్తుంది. అలా చేయడాన్ని ఘోరపాపంగా పరిగణిస్తుంది. ఇస్లామ్ మనిషి (స్త్రీ పురుషుల) గౌరవ మర్యాదల్ని కాపాడమంటుంది. "ఏ వ్యక్తయితే తన పరువును, పరివారాన్ని కాపాడుతూ హత్య చెయ్యబడతాడో అతను షహీద్" అంటుంది.

## ధన సంరక్షణ

ఇస్లామ్ ధర్మసమ్మతమయిన జీవనోపాధి కొరకు పరిశ్రమించాలని ఉపదేశిస్తుంది. ధర్మ రీతిలో వ్యాపారాన్ని అనుమతిస్తుంది. వడ్డీ, దోపిడి, దొంగతనాన్ని నిషేధిస్తుంది. ఎందుకంటే, వడ్డీ వ్యాపారం, జూదం, మట్కా వంటి వాటి వల్ల ఒకరి సొమ్ము అన్యాయంగా దోచుకోవడం జరుగుతుంది గనక. ఇవి ఒక ఆరోగ్యవంతమైన సమాజానికి గొడ్డలి పెట్టుగా ఉంటాయి గనక. వీటి ద్వారా ప్రజల మధ్య ఉండాల్సిన ప్రేమానురాగాలు పోయి రాగద్వేషాలు చోటు చేసు కుంటాయి గనక. ఒక్క మాటలో చెప్పాలంటే,"ఏ వ్యక్తయితే తన ధనాన్ని కాపాడుతూ హత్య చెయ్యబడతాడో అతను షహీద్. ఏ వ్యక్తయితే తన పరువును, పరివారాన్ని కాపాడుతూ హత్య చెయ్యబడతాడో అతను షహీద్. ఏ వ్యక్తయితే తన ధర్మాన్ని కాపాడుతూ హత్య చెయ్యబడతాడో అతను షహీద్. ఏ వ్యక్తయితే తన ప్రాణాన్ని, కాపాడుతూ హత్య చెయ్యబడతాడో అతను షహీద్" అంటుంది ఇస్లామ్.(తిర్మిజీ) ఇక ఇస్లాం మనిషికిచ్చే శిక్షణ గురించి తెలుసుకుందాం!

## శుచీశుభ్రతలు

పరిశుద్ధత, పరిశుభ్రత, పవిత్రత అనేది మానవ నైజం వాంఛించే, మానవ సమాజం కాంక్షించే సుగుణం, సహజ గుణం. దీనికి భిన్నంగా అపరిశుద్ధతను, అపవిత్రతను మానవ నైజం, మానవ సమాజం సహించదు, ఇష్టపడదు. ఈ కారణంగా అన్ని రకాల అశుద్ధాల నుండి దూరంగా ఉండాలని, శుద్ధి పొందాలనీ అంటుంది ఇస్లామ్. మనిషి మలమూత్రాలు, నిషిద్ధ జంతువుల మల మూత్రాలు, కుక్క, పంది వంటి నిషిద్ధ జంతువులకు దూరంగా ఉండాలని కోరుకుంటుంది. మలమూత్ర విసర్జన అనంతరం శుద్ధి పొందాలని, వుజూ చేయాలని, లైంగిక అశుద్ధతకు లోనైనప్పుడు స్నానమాచరించాలని, నీరు లేని పక్షంలో తయమ్ముమ్ చేయాలని ఉపదేశిస్తుంది.

## అప్పగింతల పట్ల అప్రమత్తత

ఇస్లామ్ బోధించే నైతిక ప్రమాణాలలో ఉన్నత నైతిక ప్రమాణం అమానతు. అంటే, నిజాయితీ- సచ్ఛీలత. వ్యాపారంలోగానీ, వ్యవహారంలోగానీ, మాటలోగానీ, బాటలోగానీ, నడకలోగానీ,

నడవడికలోగానీ నిజాయితీగా మసలుకోవాలంటుంది. "ఎవరి అమానతులను (అప్పగింతలను) వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా తీర్పు చేయండి అని అల్లాహ్ మిమ్మల్ని గట్టిగా తాకీదు చేస్తున్నాడు". (అన్ నిసా: 58)

## సత్య సంధత

**సత్యం-** సత్యమే సదా సాఫల్య ద్వారం. సత్యమే సమున్నతికి సోపానం- ఇహంలోనూ, పరంలోనూ అన్నది ఇస్లామ్ ఉపదేశం. కాబట్టి మనిషి సదా సత్యానికి కట్టుబడి ఉండాలంటుంది ఇస్లామ్. అసత్యానికి, అధర్మానికి, అవినీతికి, అన్యాయానికి, అక్రమానికి మనిషి ఆమడ దూరం ఉండాలంటుంది. సత్య ప్రవక్త అయిన ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "మీరు సత్యాన్ని అంటి పెట్టుకు ఉండండి. దానికే కట్టుబడి జీవించండి. ఎందుకంటే, సత్యం మంచికి మార్గం చూపుతుంది, మరి మంచి మనిషిని స్వర్గానికి దారి చూపుతుంది. అసత్యం చెడుకై పురిగొల్పుతుంది. మరి చెడు మనిషిని నరకం పాలు చేసి గాని వదలదు". (ముస్లిం)

## స్థితప్రజ్ఞత

మనిషి చేపట్టే ఏ కార్యమయినా సరే అందులో తాను స్థిత ప్రజ్ఞత స్థాయిని సాధించాలని అభిలషిస్తుంది ఇస్లామ్. మనిషి చేసే పని ఏదయినా పూర్తి ప్రావీణ్యం కలిగి పని చేయడం హర్షనీయం అంటుంది. ప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: "మనిషి తలపెట్టే ఏ మంచి పనయినా పూర్తి నాణ్యతతో, ప్రావీణ్యం కలిగి పూర్తి చేయడాన్ని అల్లాహ్ ఇష్ట పడతాడు". (తబ్రానీ)

## సంస్కారవంతమయిన వస్త్రధారణ

ఇస్లాంలో వస్త్రధారణం అందంగా, పరిశుభ్రంగా, సంస్కార వంతంగా ఉండాలి. పురుష పోలికలు గల దుస్తులు స్త్రీలు, స్త్రీల పోలికలు గల దుస్తులు పురుషులు తొడగరాదంటుంది ఇస్లామ్. అలాగే గర్వం, అహంకారం, అహంభావం ప్రదర్శిత మయ్యే దుస్తుల్ని సయితం ఇస్లామ్ నిషేధిస్తుంది. వస్త్రధారణ విషయంలో దుబారా ఖర్చును అది సహించదు. దుస్తులు మరీ పొడవాటివిగా- (పురుషులకు చీలమండలానికి క్రింది వరకు) ఉండటం, మరీ పొట్టి (కనీసం కప్పి ఉంచాల్సిన అవయవాలను బహిర్గత పర్చే) దుస్తుల్ని స్త్రీ పురుషులిరువురూ తొడగడాన్ని అది గర్హిస్తుంది. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు: "ఓ ఆదం సంతతి వారలారా! మేము మీ కోసం దుస్తుల్ని దించాము. అవి మీ మర్మస్థానాలను కప్పి ఉంచడమే గాకుండా, మీ శరీరానికి శోభాయమానంగా కూడా ఉంటాయి". (ఆరాఫ్: 26)

## పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల వాత్సల్యం

ఇస్లామ్, ఉత్తమ రీతిలో తల్లిదండ్రుల సేవ చేయాల్సిందిగా, వారి తుదిశ్వాస ఆగేంత వరకూ ధర్మసమ్మతమయిన వారి ప్రతి మాట వినాల్సిందిగా తన అనుయాయుల్ని కోరుతుంది. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు- మీరు ఆయనను తప్ప మరొకరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి. నీ సమక్షంలో వారిలో ఒకరుగాని, ఇద్దరుగానీ వృద్ధాప్యానికి చేరుకొని ఉంటే వారి ముందు విసుగ్గా 'ఉఫ్' అని కూడా అనకు. వారిని కసురుకుంటూ మాట్లాడకు. పైగా వారితో మర్యాదగా మాట్లాడు" (బనీ ఇస్రాయీల్: 23)

## బంధుత్వ సంబంధాల రక్షణ

ఇస్లామ్ బంధుత్వ సంబంధాలను పటిష్టపరచమంటుంది. అమ్మా నాన్నల తరపు నుండి ఏర్పడే సంబంధాలను బలపర్చాలంటుంది. ఒకరు మనతో మంచిగుంటే మనం వారితో మంచిగుండటం కాదు, వారు మన పట్ల అనుచితంగా వ్యవహరించినా మనం మాత్రం వారి పట్ల ఉత్తమంగా వ్యవహరించడం, వారు మన నుండి తెగత్రెంపులు చేసుకున్నా మనం మాత్రం వారితో కలిసే ఉండటం సిసలయిన బంధుప్రీతి అంటుంది.

## స్త్రీ రక్షణ

ఇస్లామ్, ఆస్తిలో న్యాయబద్ధమయిన స్త్రీ వాటాను ప్రత్యేకంగా పేర్కొంటుంది. ఆమె హెూదా, ఆమె బాధ్యతల దృష్ట్యా ఆమెకు దక్కాల్సిన హక్కును ఆమెకు ఇస్తుంది.

ఇస్లామ్, స్త్రీ పురుషుల మధ్య అన్ని విషయాలలో న్యాయబద్ధంగా వ్యవహరిస్తుంది.

ఇస్లామ్, స్త్రీకి తన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే పూర్తి స్వేచ్ఛను ఇస్తుంది. పిల్లల అసలు పోషణ అమ్మ ఒడిలోనే సాధ్యం అంటుంది. అదే విధమయినటువంటి బాధ్యతల్ని ఆమెపై మోపుతుంది.

ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "మీలోని ప్రతి ఒక్కరూ కాపలాదారుడే.. స్త్రీ తన ఇంటికి కాపలాదారు. తన సంరక్షణలో ఉన్న వారి గురించి ఆమె జవాబుదారి". (బుఖారీ)

స్త్రీ పురుషుల మధ్య గల సంబంధం పరస్పరం ఒండొకరిని బలపర్చేదిగా ఉండాలంటుంది ఇస్లామ్, స్త్రీ రహిత పురుష సమాజ అభివృద్ధిగాని, పురుషుడు లేకుండా మహిళా సమాజ అభ్యుదయం గానీ పరిపూర్ణమవ్వదు అంటుంది. ఒక ఆరోగ్య వంతమయిన సమాజానికి స్త్రీపురుషులిరువురి సహకారం, శ్రమ అవసరం అంటుంది.

## భూత దయ

ఇస్లామ్, సకల ప్రాణుల యెడల సాత్విక ప్రేమ, క్షమ, ఉపకార భావం ప్రతి వ్యక్తి మాటలోనూ, నడవడికలోనూ కలిగి ఉండాలని ఉద్బోధిస్తుంది. ఇస్లాం, మూగ జంతువుల పట్ల మెతక వైఖరి, దయాభావం కలిగి ఉండాలంటుంది. ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ప్రతి ప్రాణిలోనూ మీకు పుణ్యం ఉంది". (బుఖారీ)

## పర్యావరణ పరిరక్షణ

ఇస్లామ్, మొక్కల్ని పెంచమంటుంది. భూమి పచ్చని పొలాలతో కళకళలాడాలంటుంది. బంజరు భూముల్ని పంట పొలాలుగా మార్చాలని హితవు పలుకుతుంది. "ప్రళయం ఇంకాసేపట్లో ముంచుకొస్తుందని నీకు తెలుస్తున్నా నీ చేతిలో మొక్క ఉంటే దాన్ని నాటెయ్యి" అంటుంది. దీనికి భిన్నంగా భూమిని బంజరు నేలగా మార్చే ప్రక్రియల్ని, చర్యల్ని, లేదా భూమిని చెడు ఉత్పాదనల కోసం వినియోగించడాన్ని అది గర్హిస్తుంది. ఏ విషయంలోనయినా సరే దుబారా ఖర్చుకు దూరంగా ఉండమంటుంది. ప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: "నువ్వు ప్రవహించే నది ఒడ్డున ఉన్నా సరే (నీటిని) దుబారా ఖర్చు చేయకు".

(ముస్నద్ అహ్మద్)

ఇస్లామ్, దౌర్జన్యం, దుర్మార్గం, దురాక్రమణ, దమన నీతి, మరణించిన శత్రు శవాన్ని ముక్కలుగా నరకడం (ముస్‌లా చేయడం) నుండి వారిస్తుంది. అది ప్రతి విషయంలోనూ న్యాయానికి, ధర్మానికి, క్షమకి, విశాల భావానికి కట్టుబడి ఉండాలంటుంది. సమాజంలోని పెద్దలు, వృద్ధులు, పిల్లలు, స్త్రీల పట్ల మర్యాద పూర్వకంగా మసలు కోవాలని అభిలషిస్తుంది.

## ఇస్లాంలో దైవప్రవక్తలు

ఇస్లామ్, ప్రవక్తలందరి పట్ల విశ్వాసం కలిగి ఉండాలంటుంది. వారి మధ్య వివక్షకు తావు కల్పించకూడదంటుంది. వారిలో కొందరిని నమ్మి మరికొందరిని విశ్వసించకపోవడాన్ని అది అవిశ్వాస చర్యగా పరిగణిస్తుంది. ప్రతి జాతి వైపునకు అల్లాహ్ ప్రవక్తను పంపాడని, అలా వేర్వేరు కాలాల్లో, వేర్వేరు జాతుల్లో వచ్చిన ఆ ప్రవక్తలందరూ సత్యప్రవక్తలని, దైవభీతిపరులని, నిజాయితీపరులని, మార్గదర్శకులని, వారికి ఇవ్వబడిన సందేశాలను సంపూర్ణంగా ఆయా జాతులకు అందజేశారని అంటుంది. ఉదాహరణకు:

"మేము ప్రతి సముదాయంలోనూ ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము : "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయన తప్ప ఇతరత్రా మిథ్యా దైవాలకు దూరంగా ఉండండి". (నహ్ల్: 36)

ఏ ఒక్క ఆదేశాన్ని వారు దాచి పెట్టలేదని, మరే ఒక్క ఆదేశంలో హెచ్చు తగ్గులకు పాల్పడలేదని, తమ స్వయానికి లోబడి వారు ఏ మాటా పలుక లేదని స్వయంగా అల్లాహ్‌యే కితాబు ఇచ్చాడు: "కనుక ప్రవక్తల బాధ్యత మా సందేశాన్ని స్పష్టంగా అందజేయడం తప్ప మరొకటి కాదు". (అన్ నహ్ల్ 35)

ఈ ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స). కట్టకడపటి గ్రంథం ఖుర్‌ఆన్. ప్రళయం వరకూ వచ్చే ప్రజలందరికీ ఖుర్‌ఆన్ గ్రంథం మార్గదర్శకం, ప్రవక్త (స) వారి జీవితమే ఆదర్శం.

## ప్రవక్త ఈసా-యేసు (అ) పట్ల ముస్లింల విశ్వాసం

నిశ్చయంగా ఆయన పుణ్య స్త్రీ అయిన మర్యమ్ కుమారుడు. ఆమె సద్గుణవతి, దైవభీతి పరురాలు, సత్యవతి, సౌశీల్యవతి, అల్లాహ్ విధేయురాలయిన కన్య. ప్రవక్త ఈసా(అ) పురుష సంపర్కం లేకుండానే అల్లాహ్ ఆజ్ఞ మేరకు ఆమె కడుపున జన్మించారు అని ప్రతి ముస్లిం విశ్వసిస్తాడు.

ప్రవక్త ఈసా(అ), అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) మధ్య మరే ప్రవక్తా లేడు అని ప్రతి ముస్లిం నమ్ముతాడు.

ముస్లిం అయిన ప్రతి వ్యక్తి, ప్రవక్త ఈసా(అ) వారి చేతుల మీదుగా జరిపించిన మహత్కార్యాల్ని, మహిమల్ని- పుట్టు గుడ్డిని బాగు చేయడం, కుష్టు రోగిని బాగు చేయడం, మృతులను బతికించడం, ప్రజలు వారి వారి ఇళ్ళల్లో ఏమి కూడబెడతారో, ఏమి తింటారో తదితర విషయాల గురించి అల్లాహ్ ఆజ్ఞతో తెలియజేయడం వంటి వాటిని నమ్ముతాడు.

ప్రవక్త ఈసా(అ) హత్య చెయ్యబడలేదు, శిలువ ఎక్కించబడనూ లేదు అని, వాస్తవంగా అల్లాహ్ ఆయన్ను కాపాడి సజీవంగా, సశరీరంగా తన వైపునకు ఎత్తుకున్నాడని నమ్మడంతోపాటు, ఆయన్ను హతమార్చాలని కుట్ర పన్నిన యూదులు అపోహకు గురి చేయబడ్డారని, వేరెవరినో హత్య చేసి ప్రవక్త (స)ను హత్య చేసినట్లు భ్రమకు గురి చెయ్యబడ్డారని నమ్ముతాడు.

## ఇస్లామ్ స్వీకరించాలంటే ఏం చేయాలి?

వ్యక్తి ఎవరయినా, ఏ భాష, ఏ రంగు, ఏ ప్రాంతానికి చెందిన వాడయినా మనసా, వాచా, కర్మణా సాక్ష్య వచనాలు పలికి ఇస్లామ్ ఛత్రఛాయల్లోకి రావచ్చు. "అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప నిజ ఆరాధ్యుడెవడూ లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్(స) అల్లాహ్ ప్రవక్తని సాక్ష్యమిస్తున్నాను)".

ఈ వచనాల్ని మనస్ఫూర్తిగా పలికిన మీదట సదరు వ్యక్తి గతం పట్ల పశ్చాత్తాపం చెంది, జీవితంలో మళ్ళీ గతించిన నిర్వాకాల జోలికి వెళ్లబోనని ప్రతినబూని స్నానమాచరించాలి. ఆనక ఇస్లాం మూలాధారాలయిన అయిదు విషయాలకు క్రియా రూపం ఇచ్చేందుకు దృఢ సంకల్పం చేసుకోవాలి.

1) "అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్ వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" అని సాక్ష్యమివ్వడం. 2) నమాజును స్థాపించడం 3) జకాతును చెల్లించడం 4) రమజాను పూర్తి మాసపు ఉపవాసాలు ఉండటం 5) స్థోమత కలిగిన వ్యక్తి హజ్జ్ చేయడం.

"ఇస్లాం ఉపమానం వాన వంటిది. దాన్ని స్వీకరించి సత్కర్మలు చేసిన వ్యక్తి సారవంతమయిన నేలను పోలి ఉంటాడు. దాన్ని తిరస్కరించిన వ్యక్తి వాన కురిసినా ఎలాంటి పంటను అందించని రాతి నేలను పోలి ఉంటాడు" అన్నారు ప్రవక్త (స).




- షేఖ్ అబ్దుల్ బాసిత్

**మానవ** సమాజం నిజ దైవాన్ని మరచి, భూమి మీద అధర్మం, అన్యాయం, అరాచకం పెరిగిపోయిన ప్రతిసారి సృష్టికర్త అయిన దైవం తన దాసులలో ఉత్తములను సందేశహరునిగా ఎన్నుకుని వారి ద్వారా తిరిగి సమాజంలో ఏకేశ్వరవాదం, న్యాయం, ధర్మం నెలకొనేలా చేస్తాడు.

అలా ఈ భూమి మీద లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తలు వివిధ కాలాలలో, వివిధ ప్రాంతాల్లో ప్రభవింప బడ్డారని ఇస్లాం బోధిస్తుంది.

అలా పంపబడిన ప్రవక్తలలో అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

ప్రతి ప్రవక్త మానవాళికి అందించిన సందేశం ఒక్కటే. మానవులందరికీ సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే. మానవులందరూ ఒకే జంట ఆదమ్ హవ్వాల సంతానం.

ఈ జీవితం శాశ్వతం కాదు. శాశ్వతమైన జీవితం మరణానంతర జీవితం. ఆ శాశ్వత జీవితానికి, ఈ జీవితం ఒక పరీక్షా సాధనం.

ఒక్కడైన సృష్టికర్తను ఆరాధిస్తూ, ఆయన ప్రవక్తలు చూపిన మార్గంలో జీవించే వారికి శాశ్వత జీవితం స్వర్గం.

ఈ జీవితమే శాశ్వతం అనుకుని ఒక్కడైన దైవాన్ని ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ జీవిస్తే మరణానంతర జీవితం శాశ్వతంగా నరకాగ్నికి ఆహుతి కావాల్సి ఉంటుంది.

ఈ జీవిత సత్యాన్ని మానవాళికి తెలియజేయడానికి ఎన్నుకోబడిన అంతిమ దైవ సందేశహరుడు ప్రవక్త ముహమ్మద్ జీవితం కాలంలో సంభవించిన అతి ముఖ్యమైన ఘటన మేరాజ్ సంఘటన.

మేరాజ్ అనగా అరబ్బీలో అధిరోహించడం, లేదా నిచ్చెన అని అర్థం. సృష్టికర్త అయిన అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆకాశాల మీదకు రప్పించి సమాజ సంస్కరణ కోసం చేసిన హితబోధ ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది.

మేరాజ్ యాత్ర ఏ ఉద్దేశ్యం మేరకు జరిగిందో అల్లాహ్ తన ప్రవక్తను పిలిచి ఏమని హితబోధ చేశాడో ఖురాన్ తెలుపగా, మేరాజ్ యాత్ర జరిగిన తీరును యాత్రలో జరిగిన సంఘటనలను హదీసులు తెలియజేశాయి.

ఒక రోజు చీకటి పడిన తర్వాత కాబా గృహంలో గోడకు ఆనుకుని కూర్చొని ఉన్నారు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. అప్పటికే ప్రవక్తగా నియమించబడి పన్నెండేళ్ళు గడిచిపోయాయి. జిబ్రయీల్ దూత వచ్చి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను

జమ్‌జమ్ బావి వద్దకు తీసుకుని వెళ్ళి హృదయాన్ని జమ్ జమ్ నీటితో కడిగారు.

మెరుపు కన్నా వేగంగా పయనించే ఒక తెల్లని గుర్రం లాంటి విచిత్ర వాహనం తెప్పించబడింది.

దారిలో అనేక సంఘటనలు జరిగాయి. షైతాన్ దారి మళ్లించ డానికి ప్రయత్నం చేశాడు. కాని ప్రవక్త (స) పట్టించుకోలేదు.

మొదటి మజిలీ బైతుల్ మఖ్దిస్. అక్కడికి చేరుకున్నాక ఇంతకు ముందు వచ్చిన ప్రవక్తలందరు నమాజ్ చేయడానికి వరుసల్లో బారులు తీరి నిలబడి ఉన్నారు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నాయకత్వంలో వారంతా నమాజ్ ఆచరించారు.

ఆ తరువాత అతని ముందుకు, పాలు, నీళ్ళు, మద్యంతో నిండిన మూడు పాత్రలు తీసుకుని రాబడ్డాయి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పాలను స్వీకరించగా మీరు సహజ ధర్మాన్ని స్వీకరించారు అని జిబ్రయీల్ దూత సెలవిచ్చారు.

ఆ తరువాత ఒక నిచ్చెన తీసుకుని రాబడింది. దానిని అధిరోహించి మొదటి ఆకాశంలోకి వెళ్ళారు. అక్కడ మానవ జాతికి మూల పురుషుడు మొదటి ప్రవక్త ఆదమ్ అలైహిస్సలాం కలుసుకున్నారు. ఆయన కుడివైపు చూసి ఆనందిస్తున్నారు. ఎడమవైపు చూసి ఏడుస్తున్నారు.

"ఎందుకలా చేస్తున్నారు?" అని అడుగగా,

"కుడివైపు స్వర్గంలో ఉన్న నా సంతానాన్ని చూసి సంతోషిస్తు న్నాను. ఎడమవైపు నరకంలో ఉన్న నా సంతానాన్ని చూసి బాధపడుతున్నాను" అని సమాధానం ఇచ్చారు.

స్వర్గ నరకాల శిక్షా బహుమానాల దృశ్యాలు కొన్ని ఇక్కడ చూపించటం జరిగింది.

ఒకచోట తమ ధన మాన ప్రాణాలను ధర్మ రక్షణ కోసం దైవ మార్గంలో వెచ్చించిన వారు, ఒకవైపు నుంచి పంట కోస్తూ ఉంటే మరోవైపు నుంచి పంట పెరుగుతోంది. అంటే ఎన్నటికీ తరగని సుఖాలు అనుభవిస్తారు అన్నమాట.

మరో చోట...

సమాజు విషయంలో అలసత్వం ప్రదర్శించే వారిని బండరాళ్ళతో తలలను చితక్కొట్టే శిక్షను అనుభవించే దృశ్యం చూసారు.

ఇంకో చోట...

తమ సంపద నుంచి జకాత్, దానధర్మాలు చేయనివారు అతుకుల దుస్తులు ధరించి గడ్డి మేస్తున్న దృశ్యాలు చూసారు.

మరోచోట విశృంఖల ప్రసంగాలు చేసి సమాజంలో కలహాలు, కల్లోలానికి పాలుబడిన వారి పెదాలు కత్తెరతో కత్తిరించే శిక్షను అనుభవించే దృశ్యాలు చూసారు.

ఇంకోచోట ఉన్న బాధ్యతలను నెరవేర్చకుండా మరిన్ని బాధ్యత లను నెత్తిన వేసుకునే వారు అనుభవించే శిక్షను చూసారు.

ఇచ్చిన బాధ్యత నెరవేర్చకుండా అదనపు బాధ్యతలు స్వీకరించే వారు జాగ్రత్త పడాలి.

బాధ్యతా రహితంగా మాట్లాడి తరువాత పశ్చాతాపం పొంది సరిదిద్దుకునే ప్రయత్నాలు చేసి విఫలం అయ్యేవారు అనుభవించే శిక్ష చూసారు.

ఇంకోచోట, సాటి వారిని ఎగతాళి చేసి చిన్న చూపు చూసేవారు తమ శరీరం నుంచి మాంసం పీక్కొని తినే దృశ్యం చూసారు.

ఇతరులను పరోక్షంగా నిందించే వారు, రాగి గోళ్ళతో తమ రొమ్ములను, ముఖాన్ని పిక్కుంటున్న దృశ్యాలు చూసారు.

అనాథల సొమ్మును కాజేసేవారు వారి హక్కులను హరించే వారు ఒంటెల లాంటి పెదాలతో అగ్నిని ఆరగిస్తూ కనిపించారు.

ఇతరులను పీడించి వడ్డీ తినే వారు పాములతో నిండిన పెద్ద పెద్ద బాన పొట్టలతో పడి ఉండగా వచ్చే పోయే వారు వారిని తొక్కుకుంటూ వెళ్ళుతున్నారు.

ప్రపంచంలో అక్రమ సంబంధాలు కలిగి ఉండేవారు తాజా మాంసం ఉన్నా కుళ్ళిన మాంసం తింటూ కనిపించారు.

మరోచోట తమ అక్రమ సంతానాన్ని తన భర్తకు అంటగట్టిన స్త్రీలు వారి వక్షోజాల ఆధారంగా వ్రేలాడుతున్న దృశ్యాలు చూసారు.

ఇలా సమాజంలో జరిగే చెడులు వాటికి పడే శిక్షలను చూపించి సమాజంలోని మానవాళికి తెలిపి వారిని సంస్కరించి దైవభీతి


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఆధార సత్ సమాజ నిర్మాణం గావించడమే ఈ మేరాజ్ యాత్ర ముఖ్య ఉద్దేశ్యం.

ఈ సందర్భంగానే ముస్లిం సమాజానికి రోజు అయిదు సార్లు తప్పనిసరిగా నమాజ్ ఆచరించే ఆజ్ఞ ఇవ్వడం జరిగింది.

అలాగే సమాజంలో పరస్పర ప్రేమానురాగాలు, శాంతి సామరస్యాలు వెల్లివిరియాలని మానవులు అనుసరించ వలసిన నైతిక విలువలను ఖురాన్‌లోని సూరె బనీ ఇస్రాయిల్‌లోని కొన్ని వాక్యాలు ఇవ్వడం జరిగింది.

అందులోని ఆజ్ఞలు...

ఈ సృష్టికి సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే. మానవులంతా ఆయననే ఆరాధించాలి. ఆయన ఆదేశాలకు అనుగుణంగా జీవించాలి.

తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించాలి.

వారిలో ఒక్కరు గాని ఇద్దరు గాని ఉంటే వారిని 'ఉఫ్' అని కూడా అనకండి.


బంధువుల, అగత్యపరుల, బాటసారుల, పొరుగువారి హక్కులు చెల్లించాలి.

అనాథల సొమ్ము తినే వారు అగ్నితో కడుపు నింపుకున్నట్లు.

వృధా ఖర్చు చేయకండి. వృధా ఖర్చు చేసే వారు షైతాను సోదరులు.

దుబారాగా ఖర్చు చేయరాదు. అలా అని పిసినారితనం కూడా వలదు. మధ్యే మార్గం అనుసరించాలి.

- ➢ సంపాదించిన ధనాన్ని అగత్యపరుల, అనాథల, అవసరార్థుల అవసరాలు తీర్చి పుణ్యాలు మూట కట్టుకునే ప్రయత్నం చేయాలి.
- ➢ వ్యభిచారం దరిదాపుల్లోకి కూడా వెళ్ళకండి; అది బహు చెడ్డ మార్గం.
- ➢ పేదరికానికి భయపడి సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాం. మీకూ ఇస్తాం.
- ➢ మానవ ప్రాణం చాలా విలువైనది. అన్యాయంగా ఏ ప్రాణినీ హతమార్చకండి. అన్యాయంగా ఒక మనిషి ప్రాణం తీస్తే యావత్ మానవాళి ప్రాణం తీసినట్లు, ఒక మనిషి ప్రాణం కాపాడితే యావత్ మానవాళి ప్రాణాలు కాపాడినట్లు.
- ➢ వాగ్దాన భంగం చేయకండి.
- ➢ వాగ్దాన భంగం మనుషుల మధ్య నమ్మకాన్ని వమ్ము చేస్తుంది.
- ➢ వ్యాపారం మానవ అవసరాలు తీర్చే ఒక సాధనం. అందుకే తూనికలలో, కొలతల్లో మోసానికి పాల్పడకండి.
- ➢ అతిగా అనుమానించకండి. కొన్ని అనుమానాలు మహా పాపాలు అవుతాయి.
- ➢ తెలియని విషయాల వెంట పడకండి.
- ➢ కళ్ళు, చెవులు, మనసు, నాలుక విషయంలో దైవానికి సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.
- ➢ భూమి మీద నిక్కుతూ, నీల్గుతూ, గర్వంగా నడవకండి.
- ➢ మీరు ఎంత గర్వించినా భూమిని చీల్చనూ లేరు ఆకాశం ఎత్తుకు చేరనూ లేరు.




ఇలా ఈ మేరాజ్ యాత్ర ద్వారా సమాజ సంస్కరణ చేయడానికి అనుసరించవలసిన నైతిక మార్గం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేయడం జరిగింది.

నేటికీ 1450 సంవత్సరాలు గడిచినా ఇంకా ఆ నైతిక పునాదుల మీద ప్రపంచంలోని మూడో వంతు మానవులు జీవనం సాగిస్తున్నారు.

ఈ మేరాజ్ సందర్భంగా మనం కూడా ఆ నైతిక విలువలను అనుసరించి సమాజంలో మంచి వారిగా జీవిస్తూ, మంచిని వ్యాపింపజేస్తూ శాశ్వత పరలోక జీవితం స్వర్గమయం చేసుకునేందుకు ప్రయత్నిద్దాం.


Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**